PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 169 | విజయవాడ, మంగళవారం 21 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 21 January 2025 | Rs

బదిలీల పర్వం

- 25 మంది ఐఎఎస్‌లు, 27 మంది ఐపిఎస్‌ల స్థానచలనం
- సిఆర్‌డిఎ కమిషనరుగా కన్నబాబు
- సిఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్

2

నేటి నుంచి చిన్నారులకు ఆధార్ నమోదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర వ్యాప్తంగా 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారులకు ఆధార్ నమోదు చేసేందుకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. ఈ క్యాంపులు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు, 27 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ నమోదు చేయనున్నట్లు తెలిపింది. తప్పనిసరిగా చిన్నారులకు ఆధార్ నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల 6,264 మంది చిన్నారులు ఉండగా, అందులో నేటికీ ఆధార్ నమోదు చేసుకోని వారు 9,80,575 మంది ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్రంలో అపార అవకాశాలు

దావోస్‌లో ఉత్సాహంగా సిఎం చంద్రబాబు పర్యటన

తొలిరోజే పెట్టుబడిదారులతో వరుస సమావేశాలు

జ్యూరిచ్‌లో తెలంగాణ సిఎం రేవంత్‌తో భేటీ



దావోస్‌లో రేవంత్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు, లోకేష్, భారత రాయబారి మృదుల్ కుమార్‌తో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల అభివృద్ధికి అంతులేని అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడిదారులు తమ సంస్థలను ఎపిలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. దావోస్ పర్యటనలో భాగంగా తొలిరోజు సోమవారం పారిశ్రామిక వేత్తలతో వరుసగా సమావేశాలు నిర్వహించారు. ముందుగా జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో స్విట్జర్లాండ్‌లో భారత అంబాసిడర్ మృదుల్‌కుమార్‌తో భేటీ అయ్యారు. నెస్లే, ఎబిబి, నోవార్టిస్ వంటి దిగ్గజ కంపెనీతో సహా 350 సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాయని ముఖ్యమంత్రికి మృదుల్‌కుమార్ వివరించారు. ఎపిలో ఫార్మా స్యూటికల్స్, వైద్య పరికరాలు, టెక్నికల్ టెక్స్‌టైల్స్, రైల్ కాంపొనెంట్ వంటి తయారీ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని సిఎం పేర్కొన్నారు. స్విట్జర్లాండ్.. ఎపిలో ఏర్పాటు చేస్తున్న స్కిల్లింగ్, ఎఐ యూనివర్సిటీకి కలిసి పనిచేసేలా చూడాలని మృదుల్‌కుమార్‌కు సిఎం సూచించారు. వర్క్‌ఫ్రం హోమ్ విధానంలో స్విట్జర్లాండ్‌కు కావాల్సిన సేవలను అందించేందుకు అన్ని రంగాలకు చెందిన నైపుణ్య యువత ఎపిలో ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం స్విట్జర్లాండ్‌కు చెందిన స్విస్‌మెన్ సెక్రటరీ జనరల్ రౌల్ కెల్లర్, పాలిమర్ ప్రాసెసింగ్ రంగానికి చెందిన ఓర్లీకాన్ సిఇఒ మార్కస్ టకే, ఆంగ్స్ ఫిస్టర్ సిఇఒ ఎరిచ్ స్మిడ్, స్విస్ టెక్స్‌టైల్స్ హెడ్ ఆఫ్ ఎకనామిక్స్ జార్న్ వాన్ డెర్ క్రోన్‌ను కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి సిఎం వివరించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను వినియోగించుకునేందుకు ఎపికి రావాలని వారిని ఆహ్వానించారు. ఇన్నోవేషన్ హబ్‌లు ఇంక్యుబేటర్ల ఏర్పాటుకు స్విస్‌మెన్ కంపెనీ ముందుకు వస్తే సదుపాయాలు కల్పిస్తామని సిఎం తెలిపారు.

ఆటోమేటివ్, ఏరోస్పేస్, ఎనర్జీ, టూలింగ్ రంగాల్లో సంస్థను నెలకొల్పేందుకు ఓర్లీకాన్ ముందుకు రావాలని కోరారు. సీలింగ్ సొల్యూషన్స్ ఏర్పాటుకు ఆంగ్స్ ఫిస్టర్స్ సంస్థకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అంతకుముందు జ్యూరిచ్‌లో సిఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, టిజి భరత్ బృందానికి అధికారులు, టిడిపి యూరప్ ఫోరం సభ్యులు, ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రితో వారంతా కాసేపు ముచ్చటించారు.

కలిసిన చంద్రబాబు, రేవంత్

జ్యూరిచ్ విమానాశ్రయంలో ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి కలుసుకున్నారు. కొద్దిసేపు ఇరువురూ మాట్లాడుకున్నారు. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రాలకు వస్తున్న పెట్టుబడులపై వారి మధ్య స్వల్ప చర్చ జరిగింది.



ఆర్‌జి కర్ హత్యాచారం కేసులో సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు

- అరుదైన కేసు కాదని జడ్జి వ్యాఖ్య

కోల్‌కతా : ఆర్‌జి కర్ మెడికల్ కాలేజి ఆసుపత్రిలో డాక్టర్‌పై హత్యాచారం కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌కు సెషన్స్ కోర్టు సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సీల్దా అనిర్బన్ దాస్ ఈ మేరకు తీర్పు వెలువరిస్తూ, ఇది అరుదులో అత్యంత అరుదైన కేసు అని తాను భావించడం లేదన్నారు. 'జీవితంలో ఆఖరి రోజు వరకు సంజయ్ రాయ్‌ను జైలులో ఉంచాలి' అని ఆ తీర్పులో పేర్కొన్నారు. అలాగే బాధితురాలి తల్లిదండ్రులకు రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని మమత బెనర్జీ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఇందులో పది లక్షలు బాధితురాలి మరణానికి, ఏడు లక్షలు అత్యాచారానికి అని పేర్కొంది.

అలాగే దోషి సంజయ్‌రాయ్‌కు రూ. 50,000 జరిమానాను కోర్టు విధించింది. అయితే తమకు ఎలాంటి పరిహారం అక్కర్లేదని బాధితురాలి తల్లిదండ్రులు కోర్టుకు తెలిపారు. 'మా కుమార్తెకు న్యాయాన్ని మాత్రమే మేం కోరుకుంటున్నాం. అంతకన్నా ఇంకేం వద్దు' అని తల్లిదండ్రులు అన్నారు. దీనికి జడ్జి స్పందిస్తూ 'ఈ మరణాన్ని పూడ్చలేమని నాకు తెలుసు. అయితే బాధితురాలు డ్యూటీ డాక్టర్ కావున ప్రభుత్వానికి బాధ్యత ఉంటుంది. అలాగే మేం చట్టానికి కట్టుబడి ఉన్నందున ఈ పరిహారం చెల్లించాలి' అని తెలిపారు. ఈ కేసులో ఈ నెల 18న సంజయ్‌రాయ్‌ను కోర్టు దోషిగా నిర్ధారించిన సంగతి తెలిసిందే.



విజయవాడ ఎంపి కార్యాలయ ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు కేశవరావు, ప్రసాదరావు, హరినాథ్, ఝాన్సీ తదితరులు

దల్లేవాల్ ఆరోగ్యాన్ని కాపాడాలి

- వ్యవసాయ సమస్యలపై రైతు సంఘాలతో చర్చలు జరపాలి
- సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ పిలుపు మేరకు ఎంపి కార్యాలయాలకు రాయబారాలు, ఎంపిలకు వినతులు
- 26న ర్యాలీలు విజయవంతం చేయండి : వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- విజయవాడ, యంత్రాంగం

పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యాన్ని కాపాడాలని, రైతుల డిమాండ్లపై రైతు సంఘాల ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రైతు సంఘాల ఆధ్వర్యాన సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపి కార్యాలయాలకు రాయబారాలు నిర్వహించారు. ఎంపి కార్యాలయాల్లో వినతులు అందజేశారు. విజయవాడలోని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయానికి ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆధ్వర్యాన రాయబారం నిర్వహించారు. ఎంపి కార్యాలయ ప్రత్యేకాధికారికి సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. ఎంపిల ద్వారా ప్రధానికి ఈ సమాచారం అందించాలని కోరారు. అనంతరం ఫ్యాక్స్, మెయిల్ ద్వారా మచిలీపట్నం ఎంపి బాలశౌరికి కూడా వినతిపత్రం పంపారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 26వ తేదీ రిపబ్లిక్ డే రోజున ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లు తదితర వాహనాలతో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆయా జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక జాతీయ విధాన ముసాయిదా (ఎన్‌పిఎఫ్ఎఎం)ను తిరస్కరించేందుకు అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఖానౌరీ సరిహద్దులో జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 52 రోజులు దాటిందని, ఆయన ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో తక్షణమే చర్చలు జరపాలనే డిమాండ్లతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాజకీయ పార్టీలు, రైతు, కార్మిక సంఘాలతో కలిసి నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర చెల్లించాలని, రుణమాఫీ సహా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని కోరారు. నూతన మార్కెట్ విధానాలను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కిసాన్ సంస్థలతో తక్షణమే చర్చలు జరపాలని కోరారు. దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని ప్రధానికి మిగతా 7లో




ప్రమాణస్వీకారం చేస్తున్న డోనాల్డ్ ట్రంప్

శ్వేత సౌధంలో మళ్లీ ట్రంప్

- అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం
- ప్రపంచ నేతల అభినందనలు
- 'మై డియర్ ఫ్రెండ్ ప్రెసిడెంట్' అంటూ విషెస్ చెప్పిన మోడీ

వాషింగ్టన్ డిసి : అమెరికా 47వ అధ్యక్షుడిగా పచ్చి మితవాది డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10:30 గంటలకు అమెరికా క్యాపిటల్‌లోని రౌతుండలో అట్టహాసంగా జరిగిన వేడుకలో ట్రంప్ చేత చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణస్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా వాన్స్ చేత సుప్రీంకోర్టు మిగతా 7లో



టవర్ ఏదైనా సెల్ సిగ్నల్

- ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్ ప్రారంభం

న్యూఢిల్లీ : నెట్‌వర్క్ ఏదైనా 4జి మొబైల్ సేవలు పొందేందుకు వీలుగా కేంద్రప్రభుత్వం కొత్తగా ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఫీచర్‌ను ప్రారంభించింది. డిజిటల్ భారత్ నిధి (డిబిఎన్) కింద ఏర్పాటైన టవర్ల ద్వారా బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ కలిగిన ఏ వినియోగదారులైనా అంతరాయం లేకుండా 4జి సేవలను పొందవచ్చు. ఈ సేవలను కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా లాంచనంగా సోమవారం ప్రారంభించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో కనెక్టివిటీ అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతో 4జి సేవలను అందించడానికి 35,400 గ్రామాలకు గాను దాదాపు 27,000 మొబైల్ టవర్‌లకు డిబిఎన్ నిధులు సమకూర్చింది. ఈ విధానం మౌలిక సదుపాయాల కొరతను తగ్గిస్తుందని, దాదాపు 27,836 ప్రాంతాలను కవర్ చేస్తుందని మంత్రి సింధియా పేర్కొన్నారు. ఈ ఉమ్మడి ప్రయత్నం దేశవ్యాప్తంగా వినియోగదారులకు కనెక్టివిటీ అవకాశాలను పెంచుతుందన్నారు.

ఒకేరోజు టెండర్లు.. రూ.6,595 కోట్లు

పూలింగ్ ప్లాట్లలో సదుపాయాల కల్పన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి ఏర్పాట్లలో సిఆర్‌డిఎ ఒకేరోజు వేలకోట్ల విలువైన టెండర్లు పిలిచింది. పూలింగు ప్లాట్లలో సదుపాయాల కోసం రూ.6,595 కోట్లతో టెండర్లను ఆహ్వానించింది. అమరావతి క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్‌లో ఒకేరోజు అత్యధిక విలువతో టెండర్లు పిలవడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం పిలిచిన టెండర్లలో పూలింగు జోన్ 10, 12, 12ఏ పరిధిలో పనులు చేపట్టనున్నారు. జోన్ 10 పరిధిలోని ఐనవోలు, కృష్ణాయపాలెం, కురగల్లు, మందడం, నవులూరులో రోడ్లు, డ్రెయిన్లు, నీటి సదుపాయాలు, ఎస్‌టిపి, ప్లాంటేషన్ సదుపాయాలు చేపట్టాల్సి ఉంది. అలాగే జోన్ 12 పరిధిలోని కురగల్లు, నవులూరు, నిడమర్రు, పరిధిలోనూ, 12ఏ పరిధిలో కురగల్లు, నిడమర్రు పరిధిలో పై పనులన్నీ చేపట్టాల్సి ఉంది. ఇంతకుముందు ఎనిమిది జోన్లలో పనుల నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. మొత్తం సుమారు రూ.10 వేలకోట్ల విలువైన పనులకు సంబంధించిన టెండర్లను ఆహ్వానించారు. వీటిల్లో ఆరు జోన్లలో పనులు ఈనెలాఖరు నాటికి ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

అలాగే గతంలో ఉన్న టెండర్లకు సంబంధించి అంతకు ముందున్న కంపెనీలకే కేటాయించాలనే అంశంపైనా ఇటీవల పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు కూడా విడుదల చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తరువాత గతంలో నిలిచిపోయిన పనుల టెండర్లను పూర్తిగా రద్దుచేశారు. అయితే చర్చల అనంతరం వాటిల్లో కొన్ని టెండర్లను కొనసాగించాలని నిర్ణయించారు. వీటిల్లో ఎల్అండ్‌టి చేపట్టే పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి. టెండర్లలో పాల్గొనేవారు కూడా అంతర్జాతీయ అనుభవం ఉండాలని పేర్కొనడంతో ఎల్అండ్‌టి, మేఘా, నవయుగ, షాపూర్‌జీ పల్లోంజి వంటి కంపెనీలు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. ఈ పనులన్నీ కూడా ప్రపంచబ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపడుతున్న సంగతి తెలిసిందే.

కుబేరుల బొజ్జలు నిండుతున్నాయ్

- ట్రిలియనీర్లుగా మారుతున్న బిలియనీర్లు,
- సంపదే కాదు... పెత్తనమూ పెరుగుతోంది
- దిగజారుతున్న పేదల బతుకులు 7
- ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడి

నీటి కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి

3

బిల్లలవలసలో అతిసార

- 16 మందికి అస్వస్థత
- అదుపులోనే ఉంది : డిఎంహెచ్‌ఓ

3


భారాలు ప్రజలకు... లాభాలు ప్రైవేట్‌కు

ఆ దిశగానే క్లీన్ ఎనర్జీ పాలసీ

ఎం శివాజి



రాష్ట్రాభివృద్ధిలో విద్యుత్ కీలక పాత్ర వహిస్తుంది. ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన విద్యుత్ రంగం ప్రైవేట్‌కు వెళితే ప్రజలపై విపరీత ఛార్జీల మోత తప్పదు. గత నాలుగేళ్ల నుంచి ప్రజలను గుక్కతిప్పుకోనివ్వకుండా విద్యుత్ సంస్థలు మోయలేని భారాలు మోపుతున్నాయి. పునరుత్పాదక విద్యుత్ పేరుతో ప్రైవేట్ ఉత్పత్తిదారులను విద్యుత్ రంగంలో మరింతగా చొప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 విడుదల చేసింది. విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో రైతులు, ప్రభుత్వ భూములను కూడా ప్రైవేట్‌దారులకు కట్టబెట్టేందుకు పాలసీని రూపొందించింది. రాష్ట్రంలో మూడోదశ విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించారు. విద్యుత్ రంగంలో తొలిదశలో ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల జరిగిన బషీర్‌బాగ్ కాల్పుల విషాద ఘటన నేటికీ కళ్లముందు కనిపిస్తోంది. చంద్రబాబు ప్రవేశపెట్టిన 2014-19 రెండో దశ సంస్కరణల ఫలితంగా పునరుత్పాదక విద్యుత్‌లో ప్రైవేట్ పెట్టుబడిదారుల ప్రమేయం పెరిగింది. ఈ సంస్కరణల ఫలితంగానే ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు కరెంట్ బిల్లుల మోత మోగుతోంది.



క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం నిర్దేశించుకుంది. తద్వారా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.50 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. రాష్ట్ర అవసరాలకు పోనూ మిగిలింది బయట రాష్ట్రాలకు అమ్ముతామని చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇదే సమయంలో రాష్ట్రంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యం. అంటే దేశ ఉత్పత్తిలో 32 శాతం రాష్ట్రానిదే. ఈ లక్ష్యం సాధ్యమేనా? ఒకవేళ ఇంత విద్యుత్ వస్తే ఏం చేయాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

జెన్‌కో ప్లాంట్లు బ్యాక్‌డౌన్

పునరుత్పాదక విద్యుత్ పేరుతో ప్రైవేట్ ఉత్పత్తిదారుల నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ)లు డిస్కమ్‌లు చేసుకున్నాయి. ఇవి కాకుండా పవర్ మార్కెట్ నుంచి డిస్కమ్‌లు అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. వీటివల్ల థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తిని విద్యుత్ సంస్థలు తగ్గిస్తున్న పరిస్థితి నెలకొంది. నెలకు సుమారు 400 మిలియన్ యూనిట్ల(ఎంయు) చొప్పున థర్మల్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తిని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేస్తోంది. మరోవైపు డిమాండ్ పేరుతో అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో డిస్కమ్‌లు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. జెన్‌కో ఉత్పత్తి నిలిపివేయడం, అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్న భారాన్ని డిస్కమ్‌లు ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరుతో వినియోగదారుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం శ్లాబ్‌ల విధానంతో విద్యుత్ ఛార్జీలను పెంచింది. ట్రూఅప్‌తో పాటు వివిధ రకాల భారాలను వినియోగదారులపై మోపింది. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే రూ.15,500 కోట్ల ఎఫ్‌పిపిసిఎ భారాన్ని మోపింది. ఇది కాకుండా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో వైసిపి అమలు చేసిన నెలనెలా వసూలు చేసే ఎఫ్‌పిపిసిఎ విధానాన్ని కూడా కొనసాగిస్తోంది. దీంతో ఈ నెలలో విద్యుత్ బిల్లులు ముట్టుకుంటేనే ప్రజలకు షాక్‌లు కొడుతున్నాయి. మరోపక్క విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీల రూపంలో రూ.13,063.67 కోట్లు రావాలి. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.13వేల కోట్లు, స్థానిక సంస్థల నుంచి రూ.12వేల కోట్లు, ఇతర సంస్థల నుంచి రూ.9వేల కోట్లు రావాల్సి ఉంది. ఈ బకాయిలు రాకపోవడంతో మిగతా 7లో

వ్యవసాయ కార్మికుల కోసం ఆర్‌టిసి బస్సుల ఏర్పాటు

ప్రమాదాల నివారణకు పోలీసుల చొరవ



పోలీసుల చొరవతో ఏర్పాటు చేసిన ఆర్టీసి బస్సుల్లో వెళ్తున్న కూలీలు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ప్రమాదాలన నివారణకు వ్యవసాయ కార్మికుల కోసం ఆర్‌టిసి బస్సులు ఏర్పాటుకు ప్రకాశం జిల్లా మర్కాపురం పోలీసులు చొరవ చూపారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు అనుకూలంగా మార్కాపురం డిఎస్‌పి యు నాగరాజు, సిఐ పి సుబ్బారావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కె మాధవరావు, ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులుతో వారు సమావేశం నిర్వహించారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా ఆర్‌టిసి బస్సులు నడపాలని తీర్మానించారు. మార్కాపురం ప్రాంతంలో ఆటోల్లో కార్మికులు ప్రయాణించవద్దని, ప్రయాణిస్తే పరిమితికి లోబడి మాత్రమే ఉండాలని నిబంధనలు విధించారు. సోమవారం నుండి ఎనిమిది బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కార్మికులు ఆటోల్లో ఎక్కే ప్రదేశంలో ఆయా బస్సులను సిద్ధంగా ఉంచారు. మార్కాపురం పట్టణం నుంచి మిరప కోతలకు వందల సంఖ్యలో నిత్యం వెళుతుంటారు. వారందరికీ ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉంటాయని ముందస్తుగా చెప్పారు. రైతుల పొలాల వద్ద కార్మికులను దింపేలా చర్యలు తీసుకున్నారు. మిరప కోత ముగించిన తరువాత సాయంత్రం అదే బస్సుల్లో కార్మికులను గమ్యం చేర్చే విధంగా చర్యలు చేపట్టారు.

పని దినాలు తగ్గితే ప్రజాస్వామ్యం బలహీనం

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభల పని దినాలు తగ్గితే ప్రజాస్వామ్యం బలహీనమవుతుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. పాట్నాలో జరుగుతున్న 85వ అఖిల భారత సభాపతుల మహాసభలో ఆయన సోమవారం ప్రసంగించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందకుపైగా సభ్యులు ఉన్న చట్ట సభలు ఏడాదిలో కనీసం 75 రోజులు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఐదేళ్ల కాలంలో ప్రతియేటా 75 రోజులు చర్చలు జరగడం అవసరమన్నారు. రాజ్యాంగాన్ని వందకంటే అదనంగా సవరించడం ప్రజాస్వామ్య బలానికి సూచనగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తన ప్రసంగాన్ని తెలుగులో కొనసాగించారు.

ఉక్కు పరిరక్షణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు పరిరక్షణ కోసం కేంద్రంలోని మోడీ సర్కారుపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1439వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు కూర్చున్నారు. ఉక్కు ఉద్యమకారుడు అమృతరావు మనుమడు మోహన్ గాంధీ, ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.దశరథరామిరెడ్డి తదితరులు దీక్షా శిబిరానికి వచ్చి ఉక్కు పరిరక్షణ పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ.. ఉక్కు కర్మాగారం కోసం నాడు అమృతరావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు చేసిన పోరాటాలను గుర్తు చేశారు. అటువంటి స్టీల్‌ప్లాంట్‌ను ఉద్యమాల ద్వారా కాపాడుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

నాలుగేళ్లుగా ఉక్కు పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటాల ఫలితంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తాజాగా రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించిందని తెలిపారు. దీని ద్వారా కొంత ఉపశమనం కలిగినప్పటికీ ప్లాంట్‌కు శాశ్వత పరిష్కారం కాదన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, ఎన్.రామారావు, పుల్లారావు, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, వి.ప్రసాద్, కెఆర్‌కె.రాజు, కొయిలాడ శ్రీనివాస్, పెద్దిరెడ్ల దేముడు, ఎం.కోటేశ్వరరావు, డిసిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నెంబర్ ఇవ్వకుండానే అభ్యంతరంపై హైకోర్టు ఆక్షేపం

ప్రజాశక్తి-అమరావతి

సివిల్ వివాదాలపై కింది కోర్టుల్లో వాది (ప్లెయింటిఫ్) దాఖలు చేసే దావాలను ఆయా కోర్టుల రిజిస్ట్రీలు నెంబర్ ఇవ్వకుండానే అభ్యంతరం చెప్పడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. ప్రాథమిక దశలో వెనక్కి ఇచ్చేందుకు విధానం ఏదీ లేదని పేర్కొంది. కోడ్ ఆఫ్ సివిల్ ప్రొసీజర్ (సిపిసి) లేదా ఎపి సివిల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీస్ అండ్ సర్క్యులర్ ఆర్డర్ 1980లో ఆ విధానం లేదని తెలిపింది.

అభ్యంతరాలతో ఎలాంటి నెంబర్ ఇవ్వకుండా కక్షిదారుడిని కోర్టుకు దూరం చేస్తున్నారని వ్యాఖ్యానించింది. ఫలితంగా కక్షిదారుడికి న్యాయం అందడం ఆలస్యమవుతుందని అభిప్రాయపడింది. ఒక దావాకు నెంబర్ కేటాయించాలని విశాఖపట్నం ప్రధాన జిల్లా జడ్జి (పిడిజె) కోర్టు రిజిస్ట్రీకి ఆదేశిస్తూ ఇటీవల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి తీర్పు చెప్పారు. ఆస్తుల పంపకాల కోసం జి.వీరవెంకటరావు విశాఖపట్నం పిడిజె కోర్టులో వేసిన దావాకు రిజిస్ట్రీ అభ్యంతరాలను లేవనెత్తింది. నెంబర్ కూడా ఇవ్వలేదు. దీంతో హైకోర్టులో సవాల్ చేయడంతో పైవిధంగా తీర్పు వెలువడింది.

మా గ్రామాలకు రోడ్లు వేయరూ..

డోలీలు కట్టి, అడ్డాకుల టోపీలు పెట్టుకొని గిరిజనుల వినూత్న నిరసన



డోలీలు కట్టి, అడ్డాకుల టోపీలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - అనకాపల్లి

ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల మేరకు ఆదివాసీ గ్రామాలకు రోడ్లు వేయాలంటూ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద నాన్ షెడ్యూల్ ప్రాంత గిరిజనులు డోలీలు కట్టి, నెత్తిమీద అడ్డాకుల టోపీలు పెట్టుకుని అర్ధనగ్న ప్రదర్శనతో వినూత్నంగా నిరసన తెలిపారు. వారినుద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె గోవిందరావు, పివిటిజి సంఘం నాయకులు కిల్లో పొట్టిదొర, సీదరి కామేశ్వరరావు, సీదరి చిట్టిబాబు మాట్లాడుతూ రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కొండ శిఖర నేరేడు బంద గ్రామంలో 70 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని, వారికి రోడ్డు సదుపాయం కరువైందని తెలిపారు. జోగంపేట నుంచి నేరేడు బంద వరకు రూ.2.50 కోట్లతో రోడ్డు నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరైందని, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు శంకుస్థాపన చేశారని, కానీ ఫారెస్ట్ అనుమతులు లేకపోవడంతో రోడ్డు నిర్మాణం చేపట్టలేదని అన్నారు. గొలుగొండ మండలం డొంకాడ పివిటిజి ఆదివాసీ గ్రామంలో 80 కుటుంబాలు జీవిస్తున్నాయని, కరక ఆర్ అండ్ బి రోడ్డు నుంచి డొంకాడ వరకు రూ. 1.35 కోట్లతో బిటి రోడ్డుకు నిధులు మంజూరైనా ఫారెస్ట్ అధికారుల అనుమతులు లేకపోవడంతో రెండేళ్లుగా అక్కడా రోడ్డు పనులు ప్రారంభం కాలేదన్నారు. పశువుల బంద, సోంపురం బంద, జీలుగులోవ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్ల నిర్మాణం లేకపోవడంతో గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ బాధలు తెలుసుకునేందుకు నెలలో ఒక రోజు గిరి గ్రామాల్లో కలెక్టర్ బస చేయాలని కోరారు. చీడికాడ మండలం కోణాం పంచాయతీ రెల్లలపాలెం గిరిజన గ్రామానికి వాలాబు నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, వి మాడుగుల మండలం శంకరం పంచాయతీ శివారు మామిడిపాలెం గ్రామానికి ఉరక గెడ్డలో బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. వారినుద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక డోలీ మోతలు ఉండవని చంద్రబాబు ప్రకటించినా అది ఆచరణకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాయిరి జగన్నాథం, సోమల సూర్యనారాయణ, దారపర్తి బాలరాజు, ఉండూరు ఈశ్వరరావు, సోమల అచ్చయ్యమ్మ, తారా దేముడమ్మ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ క్లస్టర్ వ్యవస్థకు కొత్త రూపు

- గ్రేడ్లు ఆధారంగా సిబ్బంది కేటాయింపు : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



గ్రామీణ ప్రజలకు నిరంతరాయంగా పంచాయతీ సేవలు అందేలా చూడాలని, పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానంలో మార్పులు చేపట్టడంతోపాటు కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. పంచాయతీరాజ్‌శాఖలో సిబ్బంది లేరనే సమస్యను అధిగమించాలన్నారు. పంచాయతీల గ్రేడ్ల విభజనపై సోమవారం మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీల్లో పాలన సులభతరంగా ఉండేందుకు, అవసరమైన సిఫార్సులు చేసేందుకు పంచాయతీరాజ్‌శాఖ నుంచి నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటవుతుందని పవన్‌కల్యాణ్ తెలిపారు. గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవడంపై సమీక్షలో చర్చించారు. గతంలో పంచాయతీల ఆదాయాన్ని ప్రాతిపదికగా మాత్రమే చేపట్టిన క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానానికి నూతనంగా జనాభాను కూడా ప్రాతిపదికగా తీసుకుని పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లు విభజించాలని ఆయన సూచించారు. సిబ్బంది నియామకంలో హెచ్చుతగ్గులు లేకుండా గ్రామ పంచాయతీల్లో సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందాలన్నారు. ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా ఎక్కువగా ఉండే పరిస్థితుల్లో పాత క్లస్టర్ వ్యవస్థ వల్ల సిబ్బంది నియామకం విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులు ఈ సమీక్షలో చర్చించారు. జిల్లాల యూనిట్ ప్రాతిపదికన 26 జిల్లాల్లోని పంచాయతీల ఆదాయం, జనాభాను ప్రాతిపదికగా తీసుకుని జిల్లా కలెక్టర్లు ఇచ్చే నివేదికలను రాష్ట్ర కమిటీ పరిశీలించిన తర్వాత పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లను ప్రభుత్వానికి నివేదిస్తుంది. గ్రేడ్ల ఆధారంగా పంచాయతీ, సచివాలయ సిబ్బందిని పంపిణీ చేయడానికి మార్గదర్శకాలను రూపొందించనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనరు శ్రీకృష్ణతేజ పాల్గొన్నారు.

ప్యాకేజీ తెచ్చాం..

- ఇక ఉక్కు బాధ్యత కార్మికులు, యాజమాన్యానిదే.. : టిడిపి

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

'విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు టిడిపి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించింది. కేంద్రం నుంచి రూ.11,440 కోట్ల ప్యాకేజి తీసుకువచ్చాం. ఇక కర్మాగారం బాధ్యత కార్మికులు, యాజమాన్యానిదే' అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని ఒప్పించి ప్యాకేజీని తీసుకొచ్చారని తెలిపారు. ఇది టిడిపి కూటమి ప్రభుత్వం వల్లనే సాధ్యపడిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం ఉక్కుకు ఉన్న మైనింగ్ లీజును రెన్యువల్ చేయలేదన్నారు. ఒక్క రూపాయి కూడా ప్లాంట్‌కు తేలేకపోయిందని విమర్శించారు. తమపై విమర్శ చేసే హక్కు వైసిపికి లేదన్నారు. ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన కరెంట్ బిల్లు విషయంలోనూ తాము బలవంతం చేయడంలేదని తెలిపారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం, సొంత గనులు కేటాయించడం వంటి విషయాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఉక్కుకు ప్యాకేజి వచ్చేందుకు కృషి చేసిన కేంద్ర మంత్రులకు, స్థానిక ఎంపీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కూటమి నేతలు కోన తాతారావు, గంధం వెంకటరావు, ఎల్లాజీరావు పాల్గొన్నారు

సహకార ఉద్యోగుల ఆందోళన బాట

ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన సవరణ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-యంత్రాంగం

సహకార శాఖ పరిధిలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ సహకార ఉద్యోగులు సోమవారం ఆందోళన బాట పట్టారు. ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందజేశారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నాలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం 2019 మార్చిలో జిఒ 36 విడుదల చేసిందని, అప్పటి నుండి అనేక విజ్ఞప్తులు చేస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ మంత్రి అచ్చన్నాయుడికి, సహకార శాఖ కమిషనర్ ఎ.బాబుకు వినతిపత్రాలు అందజేసి సమస్యను విన్నవించినా ఫలితంలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8 నుండి దశలవారీగా ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి.వెంకటరామయ్య, కె.సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘం ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ లేనందున గ్రాట్యూటీ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రూ.20 లక్షలకు పెంచాలని, 2019 తర్వాత సంఘాలలో నియమించబడిన వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 27న విజయవాడలోని రాష్ట్ర సహకార బ్యాంకు వద్ద మహాధర్నా చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. విశాఖ, అల్లూరి జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పిఎసిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రంగనాథ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద సహకార ఉద్యోగుల ఆందోళనకు ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి సంఘీభావం ప్రకటించి ధర్నాలో పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు పాల్గొని మాట్లాడారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఆరోగ్య బీమాను వర్తింపజేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని నినదించారు. వీరి ధర్నాకు సిఐటియు, పెన్షనర్ల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.



గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సహకార ఉద్యోగులు

వాట్సాప్ గవర్నెన్స్ వైపు అడుగులు

- జనన, మరణ ధృవీకరణ పత్రాలు అందులోనే
- తెనాలిలో ప్రయోగాత్మక పరిశీలన
- సమీక్షలో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. 150 రకాల సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్-2047లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నెల 18వ తేది నుంచి దీనిని అమలు చేస్తామని ఆయన ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. వాట్సాప్ గవర్నెన్స్‌ను ద్వారా పౌరులకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సేవలను ముందుగా తెనాలిలో అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను పౌరులకు మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో వాట్సాప్ గవర్నెన్స్ సదుపాయాన్ని ప్రజలకు ముఖ్యమంత్రి అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సేవలు కల్పించడం కీలకమని, ఇందుకు సంబంధించిన పనులు త్వరితగతిన చేపట్టాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పగడ్బందీగా సేవలు ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెనాలిలో ముందుగా దీనిని ప్రయోగాత్మకంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికంగా ఇబ్బందులను సునిశితంగా పరిశీలించి అధ్యయనం చేయాలని చెప్పారు. అందుకు అనుగుణంగా ఈ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఇందుకు కావాల్సిన అన్ని విధాల సహకారాన్ని పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ, పురపాలకశాఖలు ఆర్‌టిజిఎస్ అధికారులకు అందించాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలు చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేశామని ఆర్‌టిజి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ చెప్పారు. సర్టిఫికెట్ల జారీ కోసం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ పేరుతో ఒక పోర్టల్‌ను రూపొందించామని ఆర్టీజి ముఖ్య కార్యనిర్వహణధికారి కె దినేష్‌కుమార్, అన్నారు. వెల్లడించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, పురపాలక కార్యదర్శి కె కన్నబాబు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎ సూర్యకుమారి, పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డేటా రక్షణ చట్టం లేకుండా పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందించడం పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోర్టులు త్వరితగతిన పూర్తి

- మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



నిర్మాణంలో ఉన్న మూడు పోర్టులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి సూచించారు. విభజన అనంతరం రాష్ట్రాభివృద్ధిలో పోర్టుల పాత్ర కీలకమని చెప్పారు. మంగళగిరిలోని ఎపి మారిటైమ్ బోర్డు కార్యాలయంలో పోర్టుల అభివృద్ధి- పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని మంత్రి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు అన్నింటికీ కలిపి ఒకే ప్యాకేజిలో టెండర్లు పిలవడం వల్ల కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో విడివిడిగా 6 టెండర్లు పిలవాలని అధికారులకు సూచించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో గోదాములు దీర్ఘకాలిక, స్వల్పకాలిక లీజులపైన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన సంస్థలు, యజమానులకు లీజులు పొడిగించాలని మంత్రి సూచించారు. ఫేజ్ 1లో చేపట్టిన 4 ఫిషింగ్ హార్బర్‌లు, ఫేజ్-2లో తక్కువ ఖర్చుతో చేపట్టిన మరో 5 ఫిషింగ్ హార్బర్‌ల పనుల గురించి మంత్రి సమీక్షించారు. వీటి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, సిఇఒ ప్రవీణ్ ఆదిత్య, సిఎఫ్ఒ డోలా శంకర్, సిఇ రాఘవరావు, కాకినాడ పోర్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ నిర్వహించిన మంత్రి జనార్ధన్‌రెడ్డి

టిడిపి కార్యాలయంలో మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఎంఎ షరీఫ్, కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పివిజి కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గుంటూరులోని బుద్ధ మెగాషెక్త ఫౌండేషన్ మెగా టీచర్స్ ఉద్యోగాల పేరుతో వందలమంది నిరుద్యోగులను మోసం చేశారని విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన సునీత ఫిర్యాదు చేశారు.



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న వి వెంకటేశ్వర్లు, షక్ రెహనా బేగం

సిపిఎం బలోపేతమే రాష్ట్రాభివృద్ధికి పునాది

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- నెల్లూరు

సిపిఎంను బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. దున్నే వానికి భూమి, పేదలకు ఇళ్ల స్థలాలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 276 గ్రామాల్లో భూ పోరాటాలు నిర్వహించి సుమారు 70 వేల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేసిన ఏకైక పార్టీ సిపిఎం అని తెలిపారు. అటువంటి పార్టీ బలోపేతం అయితే రాష్ట్రాభివృద్ధికి పునాది అవుతుందని తెలిపారు.

నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రచార జాతాను ముత్తుకూరు గేట్ సెంటర్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు షేక్ రెహనా బేగంతో కలిసి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర మహాసభకు 700 మంది ప్రతినిధులు, నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. అఖిల భారత కేంద్రం నుంచి ఎంఎ బేబీ, బృందా కరత్, బివి.రాఘవులు వంటి ప్రధాన నాయకులు హాజరై దిశ నిర్దేశం చేస్తారని చెప్పారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో జరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కోటమిట్ట షాదీ మంజిల్ సెంటర్లో సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఐదు దళాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి మహాసభ ప్రాధాన్యతను వివరించారు. ప్రచార జాతాలో పాల్గొంటున్న ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వేణు, కార్యదర్శి జి.శేషయ్య, సభ్యులు విజయ్‌కుమార్, రామ్మోహన్, గోపి, శంకరయ్య, ఎం.వి.రమణ, ఎన్.శ్రీకాంత్, భాషా, శివయ్య తదితరుల మెడలో పార్టీ కండువాను వి వెంకటేశ్వర్లు వేసి అభినందించారు.

బదిలీల పర్వం

- 25 మంది ఐఎఎస్‌లు
- 27 మంది ఐపిఎస్‌లకు స్థానచలనం
- సిఆర్‌డిఎ కమిషనరుగా కన్నబాబు
- సిఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 25 మంది ఐఎఎస్‌లకు, 27 మంది ఐపిఎస్‌లకు స్థానచలనం కలిగింది. ఐఎఎస్‌ల బదిలలకు సంబంధించి సోమవారం జిఒ ఆర్‌టి నెంబరు 126ను విడుదల చేసింది. జలవనరులశాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ జి.సాయిప్రసాద్‌ను సిఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సిఆర్‌డిఎ కమిషనరుగా కన్నబాబును ప్రభుత్వం నియమించింది. పశుసంవర్ధకశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బి రాజశేఖర్, జివిఎంసి కమిషనరుగా సంపత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. గృహ నిర్మాణశాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న అజయ్‌జైన్‌కు టూరిజం అండ్ కల్చరల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. టూరిజంలో ఇప్పటి వరకు పనిచేస్తున్న వినయ్‌చంద్‌ను బదిలీ చేశారు. వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న బుడితి రాజశేఖర్‌కు పశుసంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఇప్పటివరకు అక్కడ పనిచేస్తున్న ఎంఎం నాయక్‌ను బదిలీ చేశారు.

పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న కె సునీతను పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ డిపార్టుమెంట్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న యువరాజ్‌ను ఇండస్ట్రీస్ అండ్ కామర్స్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. జిపిఎం అండ్ ఎఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న వాణీమోహన్‌కు ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్ కమిషనరుగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. చీఫ్ మినిస్టర్ టు ప్రిన్సిపల్ సెక్రటరీ పీయుష్‌కుమార్‌ను ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీగా బదిలీ చేశారు. ప్లానింగ్ డిపార్టుమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ)గా ఉన్న ముఖేష్‌కుమార్ మీనాను జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (పొలిటికల్)గా మార్చారు. సౌరబ్‌గౌర్‌ను సివిల్ సప్లై కమిషనరుగా నియమించారు. జి.వీరపాండియన్‌ను అదనపు బాధ్యతల నుంచి తప్పించారు. పాఠశాల విద్య ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్న కోన శశిధర్‌కు ఉన్నత విద్యాశాఖ, స్కిల్ డెవలెప్‌మెంట్ డిపార్టుమెంట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. సిఆర్‌డిఎ కమిషనరుగా పనిచేస్తున్న కాటంనేని భాస్కర్‌ను ఐటిసిఎస్‌సి డిపార్టుమెంట్ కార్యదర్శిగా బదిలీ చేశారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు వి కరుణను సెర్ప్ సిఇఒగా బదిలీ చేశారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ సెక్రటరీ ఎన్ యువరాజ్‌కు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్టిమెంట్ డిపార్టుమెంట్ అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ (మైనింగ్) అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి శేషగిరిబాబును కార్మికశాఖ కమిషనరుగా బదిలీ చేశారు. దేవాదాయశాఖ కమిషనరు సత్యనారాయణను బిసి వెల్ఫేర్ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఇడబ్ల్యుఎస్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. టూరిజం అండ్ కల్చరల్ సెక్రటరీగా ఉన్న వాడరేవు వినయ్‌చంద్‌ను దేవాదాయశాఖ కమిషనరుగా బదిలీ చేశారు. సెర్ప్ సిఇఒ వీరపాండియన్‌ను వైద్యారోగ్యశాఖకు కమిషనరుగా బదిలీ చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరినారాయణ్‌ను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజిగా బదిలీ చేశారు. యూత్ అండ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ విసిగా ఉన్న గిరీశాను ఎపిఎంఎస్‌ఐడిసిగా బదిలీ చేశారు. స్పోర్ట్స్ అథారిటీ విసిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. సిపిడిసిఎల్ ఎమ్‌డిగా ఉన్న పి రవిసుభాష్‌ను సిఇఒ ఎన్‌టిఆర్ వైద్యసేవకు బదిలీ చేశారు. విశాఖ మున్సిపల్ కమిషనరు సంపత్‌కుమార్‌ను సిడిఎమ్‌గా బదిలీ చేశారు. పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్‌ను ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ పోలవరం ల్యాండ్ అక్విడిజేషన్, అండ్ ఆర్‌అండ్‌ఆర్‌కు మార్చారు.

ఐపిఎస్‌ల బదిలీ

రాష్ట్రంలో భారీగా ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎపి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌గా రాజీవ్‌కుమార్ మీనాను నియమించారు. లా అండ్ ఆర్డర్ అదనపు డిజిగా మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఐజిపి (ఆపరేషన్)గా శ్రీకాంత్‌ను నియమించగా, టెక్నికల్ సర్వీసెస్ ఐడిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎపి ఫోరెన్సిక్ లాబొరేటరీ ఐజిగా పాలరాజు, ఎపిఎస్‌పి బెటాలియన్ ఐజిపిగా రాజకుమారిని నియమించారు. ఎసిబి డైరెక్టర్‌గా రాజ్యలక్ష్మి, స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ డిఐజిగా అంబురాజన్, గ్రేహౌండ్స్ డిఐజిగా బాబ్జీ, ఎపిఎస్‌పి డిఐజిగా పకీరప్ప నియమితులయ్యారు. కర్నూలు ఎస్‌పిగా విక్రాంత్ పాటిల్, తిరుపతి ఎస్‌పిగా హర్షవర్ధన్ రాజు, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్‌పిగా సుబ్బారాయుడు, ఎపిఎస్‌పి కర్నూలు కమాండెంట్‌గా దీపిక, లీగల్, హ్యూమన్ రైట్స్ కో-ఆర్డినేషన్ ఎస్‌పిగా సుబ్బారెడ్డి, సిఐడి ఎస్‌పిలుగా పరమేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌లను నియమించారు. విశాఖపట్నం డిసిపిగా కృష్ణకాంత్ పాటిల్, అల్లూరి సీతారామరాజు అదనపు ఎస్‌పిగా ధీరజ్, ఆపరేషన్స్ అదనపు ఎస్‌పిగా జగదీష్, ఇంటెలిజెన్స్ ఎస్‌పిగా రామ్మోహన్‌రావు, సిఐడి ఎస్‌పిలుగా శ్రీదేవిరావు, చక్రవర్తి, కడప ఎస్‌పిగా అశోక్ కుమార్, ఇంటెలిజెన్స్ ఎస్‌పిగా రమాదేవి, విజయవాడ డిసిపి (అడ్మిన్)గా సరిత, కాకినాడ ఎస్‌పిగా బిందుమాధవిని నియమిస్తున్నట్లు సిఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగ్గురు డిఎల్‌డిఒలు కూడా..

డిప్యూటేషన్‌పై వివిధ చోట్ల పనిచేస్తున్న ముగ్గురు డిఎల్‌డిఒలను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషన్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎపిఐఐసి అనకాపల్లి జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న కె హరిప్రసాదరావును భీమిలి డిఎల్‌డిఒగా, డ్వామా విశాఖపట్నం, అనకాపల్లి ఎపిడిగా పనిచేస్తున్న ఎం రోజారాణిని విజయనగరం డిఎల్‌డిఒగా, ఎన్‌ఆర్‌ఇజిఎస్ గుత్తి క్లస్టర్ ఎడిగా పనిచేస్తున్న ఎ రాజశేఖర్‌రెడ్డిని కడప డిఎల్‌డిఒగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్‌గా గోనుగుంట్ల బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్‌గా గోనుగుంట్ల కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని కోటేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు.

ఆ విపత్తుకు బిజెపి మద్దతు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో జగన్‌కు అన్ని రకాలుగా మద్దతు ఇచ్చి, ఇప్పుడు ఆ కాలంలో మానవ విపత్తు జరిగిందని కేంద్ర హోంమంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పేర్కొన్నారు. ఆ నాటి విపత్తుకు మద్దతుగా నిలిచి ఇప్పుడు ఏమీ తెలియనట్లు వ్యాఖ్యానించడం రాష్ట్ర ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడమేనని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి గత ఆరు నెలల్లో రూ.3 లక్షల కోట్లు ఇచ్చినట్లు చెప్పడాన్ని తప్పుబట్టారు. ఈ నిధులకు సంబంధించిన వివరాలతో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేస్తామని చెబుతున్నారని, గత పదేళ్ల కాలంలో రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ఇవ్వడం శాశ్వత పరిష్కారం కాదని, తాత్కాలిక ఉపశమనమేనని చెప్పారు. అమరావతికి రూ.15 వేల కోట్లు రుణం ఇచ్చి, నిధులు ఇచ్చినట్లు చెప్పడం సరికాదన్నారు.

దావోస్ పర్యటన ఉత్తుత్తి ప్రచారం

- వైసిపి అధికార ప్రతినిధి పుత్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన అంతా భజన, అబద్ధాల ప్రచారమని, 2014-19 మధ్య జరిగింది కూడా ఇదేనని వైసిపి అధికార ప్రతినిధి పుత్తా శివశంకరరెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్కడ ఆర్భాట ప్రకటనలు తప్ప పెట్టుబడులు లేవని పేర్కొన్నారు. ఒట్టి ప్రచారాలతో పారిశ్రామికవేత్తలు ముందుకు రారని, గతంలోనూ పెద్దయెత్తున ప్రచారం జరిగినా పెట్టుబడులు వచ్చిందేమీ లేదని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏడు నెలల్లో రూ.1.19 లక్షల కోట్లు అప్పులు చేసిందని పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో ప్రజలకు ఇచ్చిందేమీ అమలు చేయలేదని తెలిపారు. వైసిపి హయాంలో చేపట్టిన గ్రీన్‌కో ప్లాంటును ఇటీవల డిప్యూటీ సిఎం సందర్శించి గొప్ప కంపెనీ అని పొగిడారని వివరించారు.

బిల్లలవలసలో అతిసార

- 16 మందికి అస్వస్థత
- అదుపులోనే ఉంది : డిఎంహెచ్ఒ



జిల్లాకేంద్రాస్పత్రిలో రోగిని పరామర్శిస్తున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి- బొండపల్లి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం బిల్లలవలస గ్రామంలో అతిసార ప్రబలింది. ఈ నెల 16 నుంచి 20 వరకు 16 మంది డయేరియా బారినపడ్డారు. వీరిలో కొందరు ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరి కొందరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. ఈ నెల 18న ముగ్గురు డయేరియా బారినపడ్డారు. ఆదివారం ఐదుగురు, సోమవారం ఎనిమిది మంది అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వైద్యాధికారులు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యాధికారి లెంక సత్యనారాయణ, డాక్టర్ జి.సమీర తెలిపారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో నిల్వ ఉన్న మాంసం, బిర్యాని తినడం వల్ల డయేరియా సోకిందని తెలిపారు. అయితే, ఇది వాస్తవం కాదని గ్రామస్తులు చెబుతున్నారు. వీరంతా ఒకోచోట, ఒకే ఆహారం తినలేదని, నీటి కలుషితం వల్లే డయేరియా ప్రబలిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామంలో తాగునీటిని తనిఖీ నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఎఇ సునీల్‌కుమార్ ఆధ్వర్యాన గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు.

ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల గుర్తింపు : డిఎంహెచ్ఒ

బిల్లలవలస గ్రామాన్ని డిఎంహెచ్ఒ జీవనరాణి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. డయేరియా అదుపులోనే ఉందని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు పోగొట్టేందుకు గ్రామంలోనే వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, 24 గంటలూ పనిచేసేలా ఈ శిబిరంలో ఇద్దరు వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించామని తెలిపారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి డయేరియా లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన ముగ్గురు మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారికి ప్రాణాపాయం ఏమీ లేదని చెప్పారు. గ్రామంలో ప్రస్తుతం కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదని తెలిపారు.

గ్రామీణ ఉపాధి హామీ హక్కుల ఉద్యమకారుడు

నరేంద్ర సింగ్ బేడీ కన్నుమూత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ ఉపాధి హామీ హక్కుల ఉద్యమకారుడు, యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపశిల్పి నరేంద్ర సింగ్ బేడీ (85) కన్నుమూశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు గ్రామంలోని తన కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరేంద్ర సింగ్ బేడీ తన జీవితాంతం పేదలు, అణగారిన వర్గాలు, రైతులు, గ్రామీణ కార్మికుల హక్కుల కోసం కృషి చేశారు. ప్రజలకు సేవలందించాలన్న ఉద్దేశంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌ను 55 సంవత్సరాల కిందట పెనుకొండ సమీపంలోని గుట్టూరులో స్థాపించారు. గత ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో కరువు నివారణ, సుస్థిరత, మానవ హక్కులు, గ్రామీణ జీవన ప్రమాణాలు, విద్య, వైద్యం, నీటి నిల్వలు, ఇంకుడు గుంతలు, వలసల నివారణ, ఇంధన పొదుపు, సంప్రదాయేతర ఇంధన వనరుల పెంపకం, ఆహారం, సేంద్రియ వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, ఉపాధి కల్పన, జాతీయ ఉపాధి హామీ చట్టం కార్యక్రమాల ద్వారా ప్రజలను అభివృద్ధి, చైతన్యం చేస్తూ ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌ను ఆయన ముందుకు నడిపారు. గ్రామీణ యువత నైపుణ్యాలు, అందు బాటులో ఉన్న ఉద్యోగ అవకాశాల ద్వారా కోరుకునే నైపుణ్యాల మధ్య అసమతుల్యత ఉందని భావించిన నరేంద్ర సింగ్ బేడీ వాటి నిర్మూలనకు తన జీవితాంతం కృషి చేశారు.



నరేంద్ర సింగ్ బేడీ (ఫైల్)

పలువురి నివాళి.. నేడు అంత్యక్రియలు

బేడీ మరణం తీరని లోటని పలువురు ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ ఎం.సురేష్ బాబు, డాక్టర్ జి.వెంకట శివా రెడ్డి, ఒపిడిఆర్ రామ్‌కుమార్, లయన్స్ క్లబ్ ప్రముఖులు విరూపాక్ష రెడ్డి, తాటికొండ సత్యనారాయణ, ఆర్‌ఇఎఫ్ డాక్టర్ హెచ్ రామచంద్ర, ఎండి నాగభూషణం, ఎన్‌జిఒ నాయకులు బలరాం కిష్టప్ప, వెంకటేష్ తదితరులు సంతాపం తెలిపారు. బేడీ అంత్యక్రియలు గుట్టూరులో మంగళవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైఎస్ జగన్ బెయిల్ రద్దు చేయాలనే

పిటిషన్లపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు, కేసుల ట్రయల్ బదిలీ చేయాలనే పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మరోసారి ఈ కేసు విచారిస్తున్న ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ మార్పు చేసింది. గతంలో విచారించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం నుంచి, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనానికి సుప్రీంకోర్టు రిజిస్ట్రీ మార్చింది. తొలుత సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారించగా, కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకున్నారు. దీంతో పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనానికి మార్చారు. కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సిబిఐ తరపు న్యాయవాది కోరారు. అదనపు సొలిసిటర్ జనరల్ మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున వాయిదా వేయాలని సిబిఐ న్యాయవాది కోరారు. వచ్చే సోమవారం విచారణ చేపడతామని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. వచ్చే సోమవారం అదనపు సొలిసిటర్ జనరల్ రాకపోతే, తానే వాదనలు వినిపిస్తానని ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దీనికి ధర్మాసనం అంగీకరించి, కేసు విచారణ వాయిదా వేసింది.



మృతి చెందిన విద్యార్థులు

నీటి కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం (కర్నూలు జిల్లా)

ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలం జంపాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల మేరకు... జంపాపురం గ్రామానికి చెందిన కురువ పద్మావతి, పెద్ద నరసింహులు దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురూ వివిధ పాఠశాలల్లో చదువుతున్నారు. సంక్రాంతి సెలవులకు వచ్చిన కుమార్తె నరసమ్మ (12), చిన్న కుమారుడు రఘువరన్ (10) తల్లిదండ్రుల వెంట గొర్రెలు మేపడానికి వెళ్లారు. ఎస్ కొట్టాల వైపు వెళ్లి ఎర్రనేల కుంటలో నీళ్లు తాగడానికని ప్రయత్నించి ఒకరి తర్వాత ఒకరు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందారు. చుట్టుపక్కల ఉన్న పశువుల కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామస్తులు నీటి కుంటలో వెతకగా ఇద్దరి మృతదేహాలు బయట పడ్డాయి. అక్క, తమ్ముడి మృతితో కుటుంబంలోనూ గ్రామంలోనూ తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ జంపాపురం గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టారు. అక్రమంగా వంకలోని గరుసును తోలడంతో పెద్ద గుంత ఏర్పడి ఈ రోజు ఇద్దరు విద్యార్థుల మృతికి కారణమైందని గ్రామస్తులు వాపోతున్నారు.

వైసిపి పాలనపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ

- అమిత్ షాను డిమాండ్ చేసిన కాంగ్రెస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటే, గత ఐదేళ్ల వైసిపి పాలనపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి పాలన మానవ విపత్తు అయితే, ఐదేళ్లు విధ్వంసం జరిగితే అప్పటి కేంద్ర హోంమంత్రిగా అమిత్ షా, ఢిల్లీలో కూర్చుని వేడుక చూశారా? అని ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులు ఆపితే, రాజధాని లేని రాష్ట్రంగా ఐదేళ్లు పాలన చేస్తుంటే కేంద్రం ఏం చేసిందన్నారు. ఇష్టారాజ్యంగా రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి విధ్వంసం చేస్తుంటే ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. సొంత బాబాయి హత్య కేసులో ఢిల్లీ స్థాయిలో న్యాయం కోసం పోరాటం చేస్తుంటే కేంద్ర హోంశాఖ మంత్రిగా మౌనం ఎందుకు వహించారని ప్రశ్నించారు. ఐదేళ్లు జగన్‌ను బిజెపి దత్తపుత్రుడుగా, పార్లమెంట్‌లో బిల్లులకు మద్దతు పలికే రబ్బరు స్టాంప్‌గా వాడుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో సహజ వనరులను అదానీకి దోచిపెట్టే ఏజెంట్‌గా ఉపయోగించుకుని రాష్ట్ర సంపదను దోచుకున్నారని, ఇప్పుడు విధ్వంసం జరిగిందని మొసలి కన్నీరు కార్చితే నమ్మే అమాయకులు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కాదని అన్నారు. ఆ విధ్వంసానికి కర్త జగన్ అయితే కర్మ, క్రియ బిజెపి ప్రభుత్వమేనన్నారు. పదేళ్లపాటు విభజన హామీలు నెరవేర్చకుండా మోసం చేసి ఇప్పుడు అండగా ఉంటామని, పూర్వవైభవం తెస్తామనే మాటలు మరో మోసానికి నిదర్శనమని అన్నారు.

పోలీసులు ఓపికగా సమస్యలు వినాలి

- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత



గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి అనిత

ప్రజాశక్తి - గోపాలపట్నం (విశాఖపట్నం)

పోలీసులు ఓపికగా బాధితుల సమస్యలను వాటిని పరిష్కరించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. ఆకస్మికంగా గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఆ సమయంలో ప్రజా సమస్యలపై విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లో అనిత పాల్గొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పోలీసులకు పలు సూచనలు చేశారు.

పోలీస్ స్టేషన్‌లో సిసి కెమెరాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, రౌడీ షీటర్ల వివరాలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఛార్జ్‌షీటు విషయంలో ఆలస్యం చేయొద్దని, ట్రాఫిక్, పార్కింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజల కష్టాన్ని ఓపికగా విని, ఫిర్యాదుదారులకు ఇబ్బంది లేకుండా త్వరగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ఆ కాపీలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ప్రజలతో దురుసుగా ప్రవర్తించవద్దన్నారు. వేపగుంటలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సింహాద్రి అప్పన్న ఆలయం వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహిళా కానిస్టేబుళ్లతో మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ద్వారక ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సిఐ గొలగాని అప్పారావు, ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రామారావు, క్రైమ్ ఎఎస్ఐ గోవిందమ్మ పాల్గొన్నారు.

రాణించిన సెంట్రల్ బ్యాంక్

- క్యూ3 లాభాల్లో 33 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో 33 శాతం వృద్ధితో రూ.958.93 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.717.86 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.3151 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ3లో 12.31శాతం పెరిగి రూ.3,540 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు రూ.10,459.89 కోట్లకు తగ్గి.. 3.86 శాతంగా చోటు చేసుకున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 4.50 శాతం స్థూల నిరర్థక ఆస్తులు నమోదయ్యాయి. క్రితం క్యూ3 నాటికి నికర నిరర్థక ఆస్తులు 1.27 శాతం నుంచి 0.59 శాతానికి దిగివచ్చాయి. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం వ్యాపారం 8.31 శాతం పెరిగి రూ.6,68,686 కోట్లకు చేరింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.6,17,368 కోట్ల వ్యాపారం నమోదయ్యింది. బ్యాంక్ డిపాజిట్లు 5.34 శాతం పెరిగి రూ.3,97,907 కోట్లకు చేరగా.. అడ్వాన్సులు 12.99 శాతం వృద్ధితో రూ.2,70,779 కోట్లుగా నమోదయ్యాయి.

తగ్గిన ఐడిబిఐ బ్యాంక్ ఎన్‌పిఎలు

ప్రయివేటు రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 31 శాతం వృద్ధితో రూ.1,908 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,458 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.7,514.27 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ3లో రూ.8,564.92 కోట్లకు చేరింది. ఇదే సమయంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.7,815.57 కోట్లకు పెరిగింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.6,540.86 కోట్ల వడ్డీ ఆదాయం చోటు చేసుకుంది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.69 శాతంగా ఉండగా.. 2024 డిసెంబర్ ముగింపు నాటికి 3.57 శాతానికి తగ్గాయి. ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 0.34 శాతం నుంచి 0.18 శాతానికి పరిమితమయ్యాయి.

తగ్గిన జొమాటో లాభాలు..

ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 57 శాతం పతనంతో రూ.59 కోట్ల నికర లాభాలకు పరిమితమయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.138 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో జొమాటో గ్రాస్ ఆర్డర్ విలువ (జిఒవి) మాత్రం 57 శాతం పెరిగి రూ.20,206 కోట్లుగా చోటు చేసుకుంది.

రామతీర్థం కేసులో

నిందితుడికి ప్రభుత్వ సాయమా?

- బిజెపి, సనాతనవాది పవన్ కల్యాణ్ దీన్ని ఎలా సమర్థిస్తున్నారు?
- స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ మతలబు ప్రయివేటీకరణ : బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రామతీర్థం కేసులోని నిందితుడికి ప్రభుత్వం ఎందుకు సాయం చేసిందని వైసిపి నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. విజయనగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్ల కిందట రామతీర్థం ఆలయంలో రాముడి విగ్రహం ధ్వంసం చేసి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నిందితుడికి సాక్షాత్తూ అదే ఆలయ ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు సిఎం సహాయ నిధి నుంచి రూ. ఐదు లక్షలు అందజేశారని తెలిపారు. ఆ కార్యక్రమంలో జిల్లా మంత్రితో పాటు, స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు సైతం పాల్గొన్నారని చెప్పారు. ఆ సంఘటన జరిగినప్పుడు దేవుడు మీద అలవిమాలిన భక్తిని ప్రదర్శించిన టిడిపి నాయకులు నానా హంగామా చేసి.. అదే కేసులో నిందితుడికి సాయం చేయడం చూస్తుంటే.. ఆ పాపంలో వారి పాత్ర కూడా ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. రాజకీయంగా టిడిపికి మేలు చేసినందుకు నిందితుడికి బహుమానంగా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఒకవేళ అదే జరిగితే దేవుడి విషయంలో రాజకీయం చేసిన వారు ఎవరైనా భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఘాటు విమర్శలు చేశారు. ఇంత దారుణం జరుగుతుంటే హిందూ సనాతనవాదిగా గొప్పగా ప్రకటించుకున్న పవన్ కల్యాణ్, హిందూ మతానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేసుకునే బిజెపి నాయకులు ఏం చేస్తున్నారని?. వారెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ అంటూ, ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారని, కానీ ప్యాకేజీ పేరుతో స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వేగంగా అడుగులు ముందుకేస్తున్నారని బొత్స విమర్శించారు. అందుకే ప్రయివేటీకరణ ఆగిపోతుందని ఏ ఒక్కరూ చెప్పడం లేదన్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రధాని, కేంద్ర హోంమంత్రితో ఆ మాట చెప్పించకపోవడం వెనుక మతలబు చేయడమేనని స్పష్టంగా తెలుస్తోందన్నారు. టిడిపి కూటమి నాయకుల అబద్ధపు హామీలు నమ్మి అన్ని వర్గాల ప్రజలు దారుణంగా మోసపోయారని బొత్స పేర్కొన్నారు.



షెడ్యూల్ కులాల వారి నుంచి విజ్ఞాపనను తీసుకుంటున్న ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

స్పష్టమైన సమాచారం ఇవ్వండి

- ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి ఆయా శాఖల వారీగా పూర్తి సమాచారాన్ని త్వరితగతిన కమిషన్‌కు ఇవ్వాలని ఎస్‌సి ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. షెడ్యూలు కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ నిమిత్తం ఆయన సోమవారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు వి.వినోద్‌కుమార్, టిఎస్.చేతన్‌తో కలిసి వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఎస్‌సి సామాజిక తరగతులు, అనుబంధ కులాల ప్రతినిధుల నుంచి వినతులను స్వీకరించారు. 237 విజ్ఞాపనలను స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమతమ శాఖలలో పనిచేస్తున్న ఎస్‌సి ఉద్యోగల వివరాలను, ఉపకులాల వారీగా కచ్చితమైన గణాంకాలతో కూడిన సమాచారం తమకు సమర్పించాలని కోరారు. కమిషన్‌కు అందిన వినతులను పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.


ఐషర్ నుంచి ప్రో ఎక్స్ విద్యుత్ వాహనాలు



న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఐషర్ ట్రక్స్ అండ్ బస్సెస్ కొత్తగా ప్రో ఎక్స్ విద్యుత్ వాహనాల శ్రేణిని ఆవిష్కరించినట్లు తెలిపింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో 2,3,5 టన్నుల విభాగంలో చిన్న వాణిజ్య వాహనాలను భారత మొబిలిటీ ఎక్స్‌పోలో ప్రదర్శించింది. ఇవి పెరుగుతున్న ఇ-కామర్స్, రవాణ అవసరాలను తీర్చనున్నాయని తెలిపింది. వీటిని తమ భోపాల్ ప్లాంట్‌లో తయారు చేసినట్లు పేర్కొంది.

గుంటూరు వైద్యుల అరుదైన ఆపరేషన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రోగి చిన్న రామయ్య తో వైద్యులు

ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి పక్కటెముకలు విరిగిపోయిన వ్యక్తికి శస్త్ర చికిత్స ద్వారా మళ్లీ యదాతథస్థితిని కల్పించేందుకు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు చేసిన కృషి ఫలించింది. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం లక్కవరం గ్రామానికి చెందిన జి చిన్నరామయ్య (66) ప్రమాదంలో గాయపడి గత నెల 28న గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ట్రాక్టర్ ఢీకొనడం వల్ల పక్కటెముకలు గుండెపై ఉండే స్టర్నల్ ఎముక విరిగి గుండెకు దగ్గరగా చొచ్చుకుపోయి ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా మారడంతో బాధితుడు వచ్చారని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆస్పత్రి వైద్యులు ప్రొఫెసర్ హరికృష్ణ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ పేరం కుప్పుస్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యోయి, ప్రమోద్ హరి, మత్తు వైద్యులు డాక్టర్ రామరాజు కలిసి శస్త్ర చికిత్స చేశారు. స్టెర్నల్ ప్లేట్స్ అమర్చామని వైద్యులు తెలిపారు. ఈ తరహా ఆపరేషన్ రాష్ట్రంలో మొదటదని ప్రొఫెసర్ హరికృష్ణమూర్తి సోమవారం మీడియాకు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ వైద్య బృందాన్ని అభినందించారు.

ఎటిఎస్ ఇఎల్‌జిఐ తదుపరి తరం ఆటోమోటివ్ సొల్యూషన్స్

న్యూఢిల్లీ : భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో నెక్ట్స్ జనరేషన్ ఆటోమోటివ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించినట్లు ఎటిఎస్ ఇఎల్‌జిఐ వెల్లడించింది. ప్రముఖ గ్యారేజీ పరికరాల తయారీదారు అయినా ఎల్గి ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఎటిఎస్ ఇఎల్‌జిఐ ఆటో ఎక్స్ పో కాంపోనెంట్స్ షోలో ఎటిఎస్ టచ్ లెస్ వీల్ అలైన్, హై పెర్ఫార్మెన్స్ కొలిషన్ రిపేర్ సిస్టం (సిఆర్ ఎస్), అడ్వాన్స్ డ్ వెల్డింగ్ ఎక్విప్ మెంట్, స్పెషలైజ్డ్ ఇవి ఎక్విప్ మెంట్, వీఆర్ టెక్నాలజీని ఉపయోగించి అధునాతన డయాగ్నోస్టిక్స్ ఎక్విప్‌మెంట్ తదితర నూతన ఆవిష్కరణలను ప్రదర్శించినట్లు పేర్కొంది.

భారత వృద్ధి అంచనాలకు మూడీస్ కోత

న్యూఢిల్లీ: భారత వృద్ధి రేటు అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఎజెన్సీ మూడీస్ కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 7 శాతానికి పరిమితం కావొచ్చని పేర్కొంది. ఇంతక్రితం 2023-24లో 8.2 శాతం వృద్ధి చోటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. 2025 మార్చితో ముగియనున్న ఏడాదిలో భారత జిడిపి 6.4 శాతానికే పరిమితం కావొచ్చని ఇటీవల స్వయంగా కేంద్ర గణంకాల శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుత 2024-25లో ప్రధానంగా అంతర్జాతీయ మందగమనం, దేశీయ బలహీనతలు వృద్ధి రేటు తగ్గుదలకు ప్రధాన కారణమని మూడీస్ పేర్కొంది. ఫిక్కీ, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇతర ఎజెన్సీలు 6.5 శాతం దిగువనే వృద్ధి ఉండొచ్చని ఇటీవల అంచనా వేశాయి.

సంపాదకీయం

గందరగోళం

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఏ విషయం చూసినా గందరగోళం సృష్టించే ఆనవాయితీని అలవర్చుకుంది. అమరావతి, పోలవరం, తిరుమల తిరుపతి దేవస్థానం, వైజాగ్ స్టీల్.. అంశం ఏదైనా చెప్పేదొకటి చేసేదింకొకటి. ప్రధాని మోడీ ఒకటి మాట్లాడతారు కేంద్ర మంత్రి ఇంకొకటంటారు, రాష్ట్ర బిజెపి నాయకులు వేరొకటి ప్రచారంలో పెడతారు. ప్రస్తుతం హాట్ టాపిక్ అయింది విశాఖ ఉక్కుకు కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజి. పది వేల కోట్లు పెట్టుబడిలో భాగస్వామ్యం చేస్తాం, తతిమ్మా 1,140 కోట్లనూ వర్కింగ్ కేపిటల్ లోన్‌లో ప్రాధాన్యతా వాటాగా మారుస్తాం అన్నారు ఉక్కు మంత్రి. ఆయనే ఫ్యాక్టరీకి 35 వేల కోట్ల అప్పులున్నాయని లెక్కలు చెప్పారు. కడకు వైజాగ్ స్టీల్‌ను ఏం చేయబోతున్నారో ఇతమిద్ధంగా తెలపలేదు. 2021 జనవరి 7న మోడీ సర్కార్ వైజాగ్ స్టీల్‌ను స్ట్రాటజిక్ సేల్ కింద వంద శాతం అమ్మాలని నిర్ణయించింది. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు నినాదంతో సుదీర్ఘ పోరాటాల ఫలితంగా వైజాగ్ స్టీల్ నెలకొల్పబడింది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి తలమానికం. లక్ష మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించే భారీ పరిశ్రమ. ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లుగా కార్మికులు పోరాడుతున్నారు. ఉక్కును పరిరక్షిస్తామని బిజెపి మినహా అన్ని పార్టీలూ ఎన్నికల్లో వాగ్దానం చేశాయి.

విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలన్నది కార్మికుల, ప్రజల డిమాండ్. సొంత ఇనుప గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని నినదిస్తున్నారు. ఇన్నేళ్లకు స్పందించిన మోడీ ప్రభుత్వం ఆ ఒక్కటీ అడక్కు అన్నట్లు వ్యవహరించి అయోమయం కలిగించడం అభ్యంతరకరం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్లాంట్‌కు ప్యాకేజి ఇవ్వడం ఆహ్వానించదగినదే. ప్రైవేటీకరణపై స్పష్టత ఇవ్వకపోవడం ప్రజలనూ మబ్బులో పెట్టడమే. కార్మికుల డిమాండ్లను నెరవేర్చి ప్రైవేటీకరణ ఉండబోదని కేంద్రం విస్పష్ట ప్రకటన చేస్తేనే కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని నడుపుతున్న బిజెపి, టిడిపి, జనసేన పార్టీల చిత్తశుద్ధి నిరూపణ అవుతుంది. అప్పటి వరకు ప్రతిష్టాత్మక విశాఖ ఉక్కు మెడపై కత్తి వేలాడుతూనే ఉంటుంది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా వైజాగ్ స్టీల్‌కు సాయం చేశామన్నారు ప్రధాని. ఆత్మనిర్భర్ కార్యక్రమాలన్నీ అప్పులు, ప్రైవేటీకరణ పైప్‌లైన్లే. పిఎస్‌యులకు ప్యాకేజీలిచ్చి అనంతరం అమ్మేసిన ఉదాహరణలూ ఉన్నాయి. ఇటీవలి విశాఖ పర్యటనలో ప్రధాని ఉక్కుపై మాట మాత్రం ప్రస్తావించకుండా ఇప్పుడు హఠాత్తుగా ప్యాకేజి ప్రకటన వెనుక మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ప్రభావం ఉన్నట్లుంది. ఒక వైపు ప్రైవేటు ఉక్కుకు అన్ని సదుపాయాలూ కల్పిస్తూ మరో వైపు ప్రభుత్వరంగంలోని విశాఖ ఉక్కును చిదిమేస్తే ప్రజల, కార్మికుల నుంచి వ్యతిరేకత వస్తుందన్న భయంతో వ్యూహాత్మకంగా ప్యాకేజిని తెరమీదికి తెచ్చారన్న వాదనలను కొట్టిపారేయలేం.

ఎ.పి.. అంటే అమరావతి, పోలవరం అని ముఖ్యమంత్రి చంద్రబాబు తరచు భాష్యం చెబుతారు. ఈ రెండింటిలోనూ కేంద్ర ప్రభుత్వం మభ్యపెట్టే ధోరణిని కనబరుస్తోంది. అమరావతికి రూ.15 వేల కోట్ల సాయం అని బడ్జెట్ సందర్భంగా ప్రకటించి, అశ్వత్థామ హత: కుంజర: అన్న చందాన అవి అప్పులని చల్లగా చెప్పింది. పోలవరం దగ్గరకొచ్చేసరికి మొదటి దశ, రెండవ దశగా విభజించింది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశ 2027 నాటికి పూర్తి చేస్తామంటుండగా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 2028కి డెడ్‌లైన్‌ను పొడిగించారు. ఇక్కడా గందరగోళానికి తెర లేపారు. నిర్వాసితుల సహాయ, పునరావాసంపై ఆది నుంచీ బిజెపిది వివాదాస్పద వ్యవహారమే. ప్రపంచ ప్రఖ్యాత టిటిడిపైనా ఆ పార్టీది అదే తీరు. ఇంతకుముందు లడ్డూ కల్తీని చూపించి టిటిడిలో జోక్యానికి యత్నించింది. ఇప్పుడు తొక్కిసలాట, అగ్ని ప్రమాదం ఘటనలను సాకుగా చూపి టిటిడి భద్రత, పరిపాలనను హస్తగతం చేసుకొనేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్‌ను చొప్పించే ఎత్తు వేసింది. టిటిడిపై అధికారాలను చేజిక్కించుకొనేందుకు పావులు కదుపుతోందని ఈ పరిణామాలతో అర్థమవుతుంది. బిజెపి ఎక్కడ జోక్యం చేసుకున్నా పాదుకొల్పేది విద్వేషాన్నే. బిజెపి పన్నాగాలపై సకాలంలో టిడిపి, జనసేన తెలివి తెచ్చుకోవాలి. ప్రజలే అప్రమత్తమై ఆ పార్టీలను ఆ వైపు నడిపించాలి.

మహనీయుల మాట




స్త్రీల జీవిత లక్ష్యం ప్రేమ, పెళ్లి, పిల్లల్ని కనడం మాత్రమే కాదు. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలి. అందుకు వారికి ఉద్యోగం కావాలి.

- బార్బరా బోడికన్,
19వ శతాబ్దపు ఇంగ్లండ్‌లో మహిళల హక్కులకై పోరాడారు.

సందర్భం

ప్రపంచ కార్మికవర్గ శ్వాస కామ్రేడ్ లెనిన్

వి. రాంభూపాల్



దోపిడిదారుల పాలనా తీరును, వారు అనుభవిస్తున్న భోగభాగ్యాల మూలాలను కారల్‌మార్క్స్ శాస్త్రీయంగా సిద్ధాంతీకరిస్తే... దోపిడిదారుల పెట్టుబడి రాజ్యాంగ యంత్రాంగం అండతో తిమింగలం లాగా మారిన సామ్రాజ్యవాదాన్ని, మత వ్యవస్థలను ఎదిరించి సోషలిజాన్ని సాధించాడు లెనిన్. కార్మికుల చైతన్యాన్ని తక్కువ చేసి మాట్లాడేవారికి, ఆర్థిక పోరాటాలే కీలకమని భావించేవారికి, పరిస్థితుల సాకుతో పనులు వాయిదా వేసేవారికి, చిన్న విజయాలను చూసి గర్విష్టులుగా మారే వారికి, మార్క్సిజానికి వక్రభాష్యాలు చెబుతూ కార్యకర్తల్లో గందరగోళాలు సృష్టించే స్వపక్ష ద్రోహులకు, పార్టీ నిర్మాణ సూత్రాలను ధిక్కరిస్తూ పార్టీ కంటే అతీతులమని భావించే అహంకారులకు ఆయన ఆచరణ ద్వారా, రచనల ద్వారా చెంప చెళ్లుమనిపించాడు. కమ్యూనిస్టులు ప్రజల మధ్య ఏమి చేయాలో, ఎలా చేయాలో నేర్పిన గొప్ప మార్గదర్శి లెనిన్.

ఓల్గా నది సమీపంలోని సింబిర్స్క్ పట్టణంలో 1870 ఏప్రిల్ 22న జన్మించిన లెనిన్ 54 ఏళ్ళు మాత్రమే జీవించి 1924 జనవరి 21న అస్తమించాడు. అతి తక్కువ జీవిత కాలంలో ఆయన చేసిన కృషి ప్రపంచ పీడితుల విముక్తి మార్గానికి నిత్య సూర్యోదయంగా, కష్టజీవుల ఉద్యమాలకు ఉఛ్వాస నిఛ్వాసాలుగా వెలుగొందుతుంది. విప్లవోద్యమానికి ఎదురైన ప్రతి క్లిష్ట సమయంలో సరైన మార్గాన్ని చూపిన గొప్ప అన్వేషి కామ్రేడ్ లెనిన్. మానవాళి సకల కష్టాలకు, కన్నీళ్ళకు మూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకవైపు పోరాడుతూనే, మరోవైపు విప్లవ పార్టీ నిర్మాణం కోసం అంతర్గత విరోధులతో ఏక కాలంలో పోరాడి విజయం సాధించిన నిజమైన సవ్యసాచి లెనిన్. దోపిడిదారుల పాలనా తీరును, వారు అనుభవిస్తున్న భోగభాగ్యాల మూలాలను కారల్‌మార్క్స్ శాస్త్రీయంగా సిద్ధాంతీకరిస్తే, దోపిడిదారుల పెట్టుబడి రాజ్యాంగ యంత్రాంగం అండతో తిమింగలం లాగా మారిన సామ్రాజ్యవాదాన్ని, మత వ్యవస్థలను ఎదిరించి సోషలిజాన్ని సాధించాడు. కార్మికుల చైతన్యాన్ని తక్కువ చేసి మాట్లాడేవారికి, ఆర్థిక పోరాటాలే కీలకమని భావించేవారికి, పరిస్థితుల సాకుతో పనులు వాయిదా వేసేవారికి, చిన్న విజయాలను చూసి గర్విష్టులుగా మారే వారికి, మార్క్సిజానికి వక్రభాష్యాలు చెబుతూ కార్యకర్తల్లో గందరగోళాలు సృష్టించే స్వపక్ష ద్రోహులకు, పార్టీ నిర్మాణ సూత్రాలను ధిక్కరిస్తూ పార్టీ కంటే అతీతులమని భావించే అహంకారులకు ఆయన ఆచరణ ద్వారా, రచనల ద్వారా చెంప చెళ్లుమనిపించాడు. కమ్యూనిస్టులు ప్రజల మధ్య ఏమి చేయాలో, ఎలా చేయాలో నేర్పిన గొప్ప మార్గదర్శి లెనిన్.

లెనిన్ అసలు పేరు వ్లదిమీర్ ఇల్యిచ్ ఉల్యనోవ్. తండ్రి ఉపాధ్యాయుడు, తల్లి గృహిణి, విద్యావంతురాలు. వీరి అరుగురు పిల్లల్లో లెనిన్ మూడవ సంతానం. తల్లి నుండి పుస్తకాలను అధ్యయనం చేయడం, అన్న నుండి ప్రజల కోసం పని చేయడం బాల్యంలోనే నేర్చుకున్నాడు. అన్న అలెక్సాండ్ర్ ద్వారా మొట్టమొదటిసారి మార్క్సిస్టు సాహిత్యానికి పరిచయం అయ్యాడు. లెనిన్‌కు 16 సంవత్సరాల వయసులో తండ్రి హఠాత్తుగా చనిపోగా, ఆ మరుసటి సంవత్సరం అన్న అలెక్సాండ్ర్‌ను జార్ చక్రవర్తి ప్రభుత్వం ఉరితీసింది. ఆహ్లాదంగా సాగుతున్న లెనిన్ జీవితంలో ఈ మరణాలు అల్లకల్లోలాలను సృష్టించాయి. కజాన్ యూనివర్శిటీలో లా విద్యార్థిగా చేరాడు. అక్కడున్న అభ్యుదయ విద్యార్థులతో కలిసి రహస్య సమావేశాల్లో పాల్గొన్నాడు. ప్రభుత్వ నియంతృత్వ చర్యలను ప్రతిఘటించడంతో యూనివర్శిటీ బహిష్కరణతోపాటు అరెస్టు అయ్యాడు. జైలు నుండి విడుదల చేసిన ప్రభుత్వం సంవత్సరం రోజులు ఒక మారుమూల గ్రామంలో ప్రవాసీగా నిర్బంధించింది. దీనికి ఆయన బెంబేలెత్తలేదు, సమయాన్ని వృధా చేయలేదు. "నా జీవితంలో ఆ సంవత్సరం చదివినంతగా ఎప్పుడూ చదవలేదు" అని ఆయన ఆ తర్వాత రాసుకున్నాడు. చిన్న చిన్న ఆటంకాలనే పెద్దవిగా చూపి పార్టీ పనులు వాయిదా వేసేవారు లెనిన్ చేసిన ఈ కృషిని గమనంలో ఉంచుకోవాలి.

మార్క్స్, ఎంగెల్స్ రచించిన అనేక గ్రంథాలను చదవడంతో పాటు, "కమ్యూనిస్టు ప్రణాళిక"ను రష్యా భాషలోకి అనువదించాడు. ఈ క్రమంలో తన అన్న అనుసరించిన నర్నోద్నిక్కుల మార్గం సరైంది కాదని, దీనివల్ల కార్మికుల, ప్రజల బాధలు తీరవని నిర్ధారణకు వచ్చాడు. మధ్యలో ఆగిపోయిన యూనివర్శిటీ కోర్సును పద్దెనిమిది నెలల్లో పూర్తి చేసి న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించాడు. అది ఎక్కువ కాలం కొనసాగలేదు. తన విప్లవ కార్యాచరణను నాటి రష్యా రాజధాని సెంట్ పీటర్స్‌బర్గ్‌లో కొనసాగించేందుకు 1893లో అక్కడకు వెళ్లాడు. అక్కడ జరుగుతున్న కార్మికుల పోరాటాల్లో పాల్గొంటూ, నాయకులతో పరిచయాలు పెంచుకుని కార్మిక వర్గానికి విప్లవ రాజకీయ పార్టీ అవసరమని వారి ముందు ప్రతిపాదన పెట్టాడు. ఈ ప్రతిపాదనకు నర్నోద్నిక్కులు అడ్డుతగిలారు. పీటర్స్‌బర్గ్ వెళ్లిన సంవత్సరానికే (1894లో) "ప్రజల మిత్రులు ఎవరు? వాళ్ళు సోషల్ డెమోక్రాట్లతో ఎలా పోరాడతారు?" అనే పుస్తకాన్ని రాశాడు. కొత్త రంగాల్లోకి, ప్రాంతాల్లోకి వెళ్లి పని చేయాలంటే నాకు అక్కడ ఎవరూ పరిచయం లేరని వాదించేవారు యువ కార్యకర్తగా లెనిన్ చేసిన ఈ కృషి సదా గుర్తించుకోవాలి.

మార్క్సిజం సారాన్ని కార్మికులకు ముఖ్యంగా చురుకుగా వున్న కార్మికులకు సులభంగా, క్లుప్తంగా చర్చల ద్వారా, సంఘటనల ద్వారా వివరించడం కోసం స్టడీ సర్కిళ్లు నిర్వహించాడు. ఈ క్రమంలోనే కృపస్కయా అనే కార్మిక నాయకురాలితో పరిచయమై ఆ తర్వాత పెళ్లి చేసుకున్నాడు. మార్క్సిజాన్ని, కార్మికవర్గ సమస్యలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి కరపత్రాలు, పుస్తకాలను మార్గాలుగా ఎంచుకున్నాడు. 'కార్మికవర్గ విముక్తి పోరాట సమితి' పేరుతో ఒక రాజకీయ సంస్థను ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ ఆధ్వర్యంలో పీటర్స్‌బర్గ్ లో 30 వేల మంది జౌళి కార్మికులు 1896లో చరిత్ర ప్రసిద్ధికెక్కిన సమ్మె చేశారు. 'కార్మికుల లక్ష్యం' అనే పేరుతో వార్తా పత్రిక నడుపుతున్నాడని లెనిన్‌ను అరెస్టు చేసి 14 నెలలు ఒంటరిగా నిర్బంధించారు. మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీయాలని శత్రువులు భావించగా అందుకు భిన్నంగా రాటుదేలిన విప్లవకారుడిగా తయారయ్యాడు. రష్యా ప్రభుత్వం లెనిన్‌ను వెంటాడటం తీవ్రం చేసి 1897లో మరలా అరెస్టు చేసి మూడు సంవత్సరాలు సైబీరియా ప్రవాసం (మన దేశంలో అండమాన్ జైలు లాంటిది) శిక్ష వేశారు. అది ఒక మారు మూల గ్రామం. అందుబాటులో వున్న పరిమిత అవకాశాలతోనే ముప్పైకి పైగా రచనలు చేశాడు. ఇందులో ప్రఖ్యాతమైన 'రష్యన్ సోషల్ డెమోక్రాట్లు-కర్తవ్యాలు' ఒకటి. అలాగే 'రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి' గ్రంథం మార్క్స్ రాసిన 'పెట్టుబడి' గ్రంథానికి కొనసాగింపుగా నిలిచింది. ఈ కాలంలో జరిగిన సమ్మెల వల్ల కార్మికులకు కొంత వేతనాలు పెరగడంతో కార్మిక నాయకుల్లో ఆర్థికవాదం పెరిగింది. దీని ప్రమాదాన్ని లెనిన్ వేగంగా గుర్తించి కార్మికుల్లో వర్గ చైతన్యం పెంచడానికి కార్మిక పత్రిక ఉండాలని, అందుకు పార్టీని సన్నద్ధం చేశాడు. పోలీసు నిర్బంధం వల్ల విదేశాల నుండి ఈ పత్రికను నడపాలని నిర్ణయించాడు. అందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశాడు. లెనిన్‌ను విప్లవ కృషిని పసిగట్టిన రష్యా ప్రభుత్వం ఆయనను హత్య చేయడానికి ప్రణాళిక వేసింది. ఈ స్థితిలో లెనిన్‌ను జర్మనీకి పంపి కాపాడుకోవాలని పార్టీ నిర్ణయించడంతో ఐదు సంవత్సరాలు రహస్య జీవితం గడిపాడు. ఈ సమయంలోనే 'ఇస్క్రా' పత్రికను ప్రచురించి, కార్మిక పత్రికను 'ఆందోళనకారుడుగా, గొప్ప ప్రచారకుడుగా, నిర్మాణ దక్షుడుగా' తీర్చిదిద్దాడు.

1902లో ఆయన రాసిన 'ఏం చేయాలి?' పుస్తకంలో "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవ ఉద్యమం ఉండదు.. విప్లవ పార్టీ లేకుండా విప్లవాన్ని నడపడం సాధ్యం కాదని" లెనిన్ నిర్ధారించాడు. బూర్జువా సమాజంలో బూర్జువా భావజాలంగానీ, కార్మికవర్గ భావజాలంగానీ ఏదో ఒకటి మాత్రమే ఉంటుందని మధ్యే మార్గం అనేది వుండజాలదని చెప్పాడు. తటస్థత ముసుగు వేసుకుని పాలక పార్టీల వంత పాడే కుహనా మేధావులను ఆయన ఆనాడే ఎండగట్టారు. విప్లవానికి వృత్తి విప్లవకారుల ప్రాధాన్యతను గుర్తించి ప్రపంచ విప్లవోద్యమానికి మార్గదర్శిగా నిలిచాడు లెనిన్. పార్టీలో నిర్మాణ సూత్రాల విషయంలో వచ్చిన విభేదాలపై 1904లో 'ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి' పుస్తకంలో "అధికారం కోసం చేసే పోరాటంలో కార్మిక వర్గానికి నిర్మాణం తప్ప మరొక ఆయుధం లేదు" అని నొక్కి చెప్పాడు. బూర్జువా ప్రజాతంత్ర విప్లవ ప్రాధాన్యతను వివరిస్తూ 1905లో "ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రాట్ల రెండు ఎత్తుగడలు" అనే గ్రంథం రాశాడు. ఈ కృషి అంతా పోలీసులకు చిక్కకుండా, విదేశాలలో రహస్యంగా వుంటూ చేశాడని గుర్తించుకోవాలి. 1905లో బోల్షివిక్కులకు, మెన్షివిక్కులకు మధ్య భూ సమస్యపై జరుగుతున్న చర్చల పరిష్కారంగా "వ్యవసాయిక సమస్య" అనే పుస్తకాన్ని రాశాడు.

లెనిన్‌పై ప్రభుత్వ నిఘా పెరగడంతో 1907లో మరోసారి రహస్య జీవితానికి వెళ్లాడు. ఈసారి ఆయన దాదాపు పదేళ్ళు అంటే విప్లవం వచ్చిన 1917 వరకు ప్రవాసంలో గడిపాడు. జాతుల ప్రత్యేకతల గురించి వాటికి విడిపోయే హక్కు గురించి 'జాతుల సమస్య' అనే పుస్తకంలో వివరించాడు. కార్మికవర్గ విప్లవ తక్షణ కర్తవ్యాలను 'ఏప్రిల్ థీసిస్'లో వివరించాడు. సమస్త భూమిని జాతీయం చేయాలని "సర్వాధికారాలు సోవియట్లకు" వుండాలని ప్రతిపాదించాడు. కమ్యూనిస్టుల మద్దతుతో ఏర్పడిన బూర్జువా తాత్కాలిక ప్రభుత్వం కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా లెనిన్ మీద, పార్టీ నాయకత్వం మీద పెద్ద ఎత్తున నిందా ప్రచారం చేయడమే కాక ఆయనను హత్య చేయాలని నిర్ణయించింది. ఈ సమయంలో పార్టీ ఆదేశంతో పెట్రోగ్రాడ్‌లోని ఓ కార్మికుడి ఇంట్లో గడ్డి కోసే కూలిగా మారు వేషంలో జీవించారు (నీలం నోట్‌బుక్ పుస్తకం). ఇక్కడే ప్రసిద్ధమైన "రాజ్యం విప్లవం" గ్రంథాన్ని రచించి 'అతి కొద్దిమందిగా వున్న పెట్టుబడిదారులు అత్యధిక మంది ప్రజలను అణచివేసే బూర్జువా నియంతృత్వ స్థానంలో అత్యధిక మంది కోసం అతి కొద్దిమందిని నియంత్రించే కార్మికవర్గ నియంతృత్వ వ్యవస్థ ఏర్పడాల"న్నాడు.

1917 అక్టోబర్‌లో కార్మికవర్గం చేసిన తిరుగుబాటుకు రైతుల, ప్రజల, సైనికుల మద్దతును పొంది విప్లవాన్ని జయప్రదం చేసి ప్రథమ సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించాడు. నూతన ప్రభుత్వ సారధిగా ఒకవైపు ప్రపంచ యుద్ధం, మరోవైపు దేశంలో ఆహార సంక్షోభ సమస్యలను ఎదుర్కొన్నాడు. నిర్దిష్ట పరిస్థితులను అంచనా వేసి దూరదృష్టితో జర్మనీతో శాంతి ఒప్పందం కోసం పార్టీ చేసిన నిర్ణయం ట్రాట్స్కీ ద్రోహం వల్ల విఫలమైంది. ఆ క్లిష్ట సమయంలో బాల్య దశలో వున్న సోషలిస్టు రాజ్య రక్షణ కోసం ఆయన ఎనలేని కృషి చేశాడు. స్త్రీలు, యువకుల భవిష్యత్ పట్ల లెనిన్ ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. ప్రతి వంటగత్తె రాజకీయవేత్త కావాలని వాంఛించాడు. కమ్యూనిస్టు సమాజ నిర్మాణానికి కమ్యూనిస్టు నీతి, విలువలే ఆధారాలని, వాటిని కాపాడుకోవాలని యువతకు ఉద్బోధించాడు. నూతన కార్మిక వ్యవస్థను సహించలేని సామ్రాజ్యవాదులు పార్టీ విద్రోహులతో కలిసి...లెనిన్‌ను, ఆయన అనుచరులను హత్య చేయడానికి చేసిన కుట్రలో భాగంగా 1918 ఆగస్టు 30న కస్లావ్ అనే మహిళ లెనిన్‌ను అతి సమీపం నుండి పిస్టల్‌తో కాల్చింది. ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. దేశం దిగ్భ్రాంతి చెందింది. చావుబతుకుల మధ్య పోరాడి లెనిన్ కోలుకున్నప్పటికీ 1923లో ఆయన ఆరోగ్యం క్షీణించి, 1924 జనవరి 21వ తేదీన లెనిన్ తుది శ్వాస విడిచి ప్రపంచ కార్మిక విముక్తి శ్వాసలో కలిశాడు.

(జనవరి 21 లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా)
/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

కవిత్వం


వేమన్న మాట సద్దన్నపు మూట

నీతి గ్రంథాలను వడబోసిన మాటలు
చక్కనైన అచ్చ తెలుగు సిరులు
ముత్యాల్లాంటి పదాలు సమకూర్చి
తెలుగు నేలపై ఆరబోసిన పద్య మాధుర్యం.
వేమన్న మాటలే సద్దన్నపు మూటలు
బాల్యంలోనే వంటబడితే
భవిష్యత్తు అంతా బంగారపు పూత
ఉన్నతత్వపు విలువల గౌరవ మర్యాదలు.
ఆటవెలదిలో అమరిన అక్షర సొగసు
జానపద తెలుగు భాష వైశిష్ట్యం
ఉపమానాలకే వన్నె తెచ్చిన వైనం
పద్య మకుటం తోనే శాశ్వత కీర్తి నార్జించే.
జలపాతములా అక్షరపు పరవళ్ళు
లోక సూక్తుల నిధుల సారాంశపు సౌందర్యం
గురి తప్పని బాణము లాంటి మాటలు
ఉద్గ్రంథాల సారం నాలుగు పాదాల్లో అమరే.
యథార్థమైన అక్షరపు ఔషధ గుళికలు
లోక అనుభవ మాటల మాంత్రికుడు
సరళ పదాల లాలిత్యంతో అల్లికలు
ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నల వర్షం.
మూఢత్వంపై నిప్పులాంటి పద్యాలు
అజ్ఞానంపై విసిరిన జ్ఞానపు ఖడ్గం
పచ్చి నిజాలను కురిపించిన మాటల పవనం
పద్యానికే వన్నె తెచ్చిన సొగసుల వనము.
గాంభీర్యపు మాటల రణరంగపు విన్యాసం
అస్త్రాల్లా తరిమిన పదాల కత్తులు
నిజాలను నిక్కచ్చిగా చెప్పగలిగిన వ్యక్తి
తెలుగు సాహిత్యంలో అతనే ప్రజా కవి.
వ్యక్తిత్వ వికాసానికి వేమన్న పద్యాలు
ఒక్క పద్యము చదివిన చాలు మార్పునకు
కంఠం బట్టిన పద్యం ఒంటబట్టిన చాలు
జీవన ప్రయాణంలో ఆత్మజ్ఞానిగా నిలుస్తాం.

- కొప్పుల ప్రసాద్,
నంద్యాల, సెల్ : 9885066235

విశ్లేషణ

పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్యాకేజి



సిహెచ్. నరసింగరావు

కేంద్ర ప్రభుత్వ "క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్" (సి.సి.ఇ.ఎ) ప్రధాన మంత్రి మోడీ అధ్యక్షతన జనవరి 17న జరిగిన సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ రివైవల్ ప్యాకేజీ కోసం రూ.11,440 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది. ఎన్‌డిఎ ప్రభుత్వం 6 నెలలు కష్టపడి ఉక్కు సంకల్పంతో సాధించిన ఘన విజయంగా రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వ అధినేతలు ప్రకటించారు. విశాఖ స్టీల్‌ను 100 శాతం ప్రైవేటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సుమారు గత నాలుగు సంవత్సరాల కాలంలో...రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మిక వర్గం నిరంతర పోరాట ఫలితంగానే ఈ ప్యాకేజీ సాధ్యమైంది. స్టీల్ కార్మికులు, ప్రజలు పోరాడి సాధించుకున్న ప్యాకేజీ ఇది. ఈ ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం దేనికి ఖర్చు పెడుతుందో ముందు ముందు చూడాలి. అయితే ఈ ప్యాకేజీ విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఈ ప్యాకేజీని అందరూ ఆహ్వానిస్తున్నారు. అయితే ప్లాంటుకు ముఖ్యం స్వంత గనులు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.11,440 కోట్లలో రూ.1140 కోట్లు షేర్ ధనానికి అసలు, వడ్డీతో సహా కేంద్ర ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలి. ఈక్విటీగా కేటాయించిన రూ.10,300 కోట్లలో ఇప్పటికే రూ.1200 కోట్లు విశాఖ స్టీల్‌కు వినియోగించారు. కార్మికుల పి.ఎఫ్, జీతాలకు ఇందులో రూ. 1000 కోట్ల బకాయిలు చెల్లించాలి. 2025 ఆగస్టు నాటికి మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపి పూర్తి సామర్థ్యం సాలీనా 73 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి ఉత్పత్తి సాధించడానికి సాలీనా రూ.18 వేల కోట్లు ముడి ఖనిజాలకు ఇప్పటి రేట్ల ప్రకారం ఖర్చు అవుతుంది. రెండు సంవత్సరాలలోనైనా 100 శాతం సామర్థ్యం సాధించడానికి ఇప్పుడు కేటాయించిన నిధులు ఏ మూలకూ సరిపోవు. కేవలం 7 లక్షల టన్నుల సామర్థ్యం వున్న కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్‌కు రూ.18 వేల కోట్లు కేంద్రం కేటాయించింది. ఇద్దరు ఎంపీలతో కర్ణాటక రూ.18 వేల కోట్లు సాధించినా అక్కడ ఇంత ఆర్భాటం చేయలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో గొప్పగా ప్రచారం చేయడం సంకీర్ణ ప్రభుత్వ ఘనత. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలని నిర్ణయించిన 2021-22 సంవత్సరంలో కూడా విశాఖ స్టీల్ రూ.913 కోట్లు నికర లాభాలార్జించింది. రూ.28,215 కోట్లు అత్యధికంగా టర్నోవర్ పొందింది. గత మూడు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వం, అదాని పోర్టులు ఉత్పత్తిని అడ్డుకుని విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టాయి. విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి నిజాయితీతో కేంద్ర ప్రభుత్వం నిలబడితే ఈ నష్టాలు విశాఖ స్టీల్‌కు లెక్కలోకి రావు. 1991 నుంచి కేంద్ర ప్రభుత్వం ఒక్క కోటి రూపాయలు కూడా విశాఖ స్టీల్‌కు కేటాయించక పోయినా స్వంత లాభాలతో రూ. 22 వేల కోట్లు వెచ్చించి 73 లక్షల టన్నుల సామర్థ్యానికి చేరింది.



విశాఖ స్టీల్‌ను 100 శాతం ప్రైవేటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సుమారు గత నాలుగు సంవత్సరాల కాలంలో... రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మిక వర్గం నిరంతర పోరాట ఫలితంగానే ఈ ప్యాకేజీ సాధ్యమైంది. స్టీల్ కార్మికులు, ప్రజలు పోరాడి సాధించుకున్న ప్యాకేజీ ఇది. ఈ ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం దేనికి ఖర్చు పెడుతుందో ముందు ముందు చూడాలి. అయితే ఈ ప్యాకేజీ విశాఖ స్టీల్ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఈ ప్యాకేజీని అందరూ ఆహ్వానిస్తున్నారు. అయితే ప్లాంటుకు ముఖ్యం స్వంత గనులు.

భారీ స్టీల్ ప్లాంట్లకు ముడి ఖనిజమే ప్రధాన పెట్టుబడి. ముడి ఖనిజాల్లో ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ ప్రధానమైనవి. 2000 సంవత్సరం నుంచి ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2000 సంవత్సరంలో మార్కెట్‌లో టన్ను ఇనుప ఖనిజం రూ. 500 ఉంటే నేడు టన్ను 6000 నుండి 8000 రూపాయల వరకు ఎగబాకింది. కోకింగ్ కోల్ మన దేశంలో లభ్యం కాదు. విదేశాల నుండి దిగుమతి చేసుకుంటాం. 2018లో 48 డాలర్లు ఉన్న కోకింగ్ కోల్ ధర నేడు టన్ను 240 డాలర్లకు పెరిగింది. ప్రపంచంలో పుష్కలంగా ఇనుప ఖనిజం లభించే దేశాలలో భారతదేశం ఒకటి.

కేంద్ర ప్రభుత్వం మన దేశంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్లకు ఇనుప ఖనిజం 100 సంవత్సరాలకు సరిపడా కేటాయించింది. టాటా, భిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా వంటి స్టీల్ ప్లాంట్లు అన్నింటికీ ముడి ఖనిజం సమృద్ధిగా వుంది. వారితో విశాఖ స్టీల్ పోటీ పడాలి. మార్కెట్‌లో అన్ని స్టీల్‌ప్లాంట్ల అమ్మకాల రేట్లు ఒక్కటే. మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ చట్టం 1957 సెక్షన్ 17(1)(బి) ప్రకారం ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటికి ముడి ఖనిజం గనులు కేటాయించాలని ముడి ఖనిజం గనుల చట్టంలో స్పష్టంగా వుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు స్వంత గనుల కేటాయింపు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణ సమయంలో 1985లో విడుదల చేసిన డి.పి.ఆర్ ప్రకారం ఎన్.ఎమ్.డి.సి (నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), బైలదిలా లోని నాలుగు, ఐదు బ్లాకుల్లో స్వంత గనులు విశాఖ స్టీల్‌కు కేటాయించాలి. ప్రభుత్వ రంగంలో 1990లో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కావాలనే, ప్రైవేటు చేయడానికే కేంద్ర ప్రభుత్వాలు స్వంత గనులు కేటాయించలేదు. స్వంత గనులు కేటాయిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ బలపడుతుంది. స్టీల్ రంగంలో విశాఖ స్టీల్ తిరుగులేని శక్తిగా ఎదుగుతుంది. పాలకులు వారి ఇష్టం వచ్చిన ప్రైవేటు కంపెనీలకు విశాఖ స్టీల్‌ను కారుచౌకగా కట్టబెట్టాలనే దురుద్దేశంతోనే విశాఖ స్టీల్‌కు నేటికీ స్వంత గనులు కేటాయించడానికి నిరాకరిస్తున్నారు. కనీసం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విలీనం చేయాలన్న కార్మికుల డిమాండ్‌ను బి.జె.పి పాలకులు ఖాతరు చేయడంలేదు.

విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోకెల్లా సముద్ర తీరంలో 20 వేల ఎకరాల స్వంత భూములలో ఏర్పడిన ఏకైక భారీ స్టీల్ ప్లాంట్. నవరత్న గుర్తింపు పొందిన ఏకైక స్టీల్ ప్లాంట్ కూడా ఇదే. బంగారు బాతు లాంటి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాజేయడానికి కార్పొరేట్లు పోటీ పడుతున్నారు. వాటిని ప్రతిఘటించి విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా విశాల ఐక్య ఉద్యమం సాగించాలి. కార్మికుల పోరాటం, ప్రజల సంఘీభావం పరిఢవిల్లాలి.

/వ్యాసకర్త సి.ఐ.టి.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి/

జనవాక్యం

లోకాయుక్తకు అద్దె భవనాల నుండి విముక్తి?

గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలోని అన్ని ముఖ్య ప్రభుత్వ కార్యాలయాలను అద్దె భవనాలలో పెట్టి రాష్ట్ర ఖజానాకు కొట్లాది రూపాయలు నష్టం కలిగించింది గత ప్రభుత్వం. ముఖ్యంగా రాష్ట్ర నడిబొడ్డున ఉండవలసిన లోకాయుక్త కార్యాలయాన్నీ కర్నూలు లోని అద్దె భవనంలో పెట్టారు. నెలకు ఆరేడు లక్షల రూపాయలు అద్దె. ఆరు నెలల నుండి అద్దె చెల్లించని కారణంగా బిల్డింగు ఓనరు ఖాళీ చేయమంటున్నారు. రేపు ఫిబ్రవరికి అద్దె భవనం రెన్యూవల్ చెయ్యాలి. లోకాయుక్త కార్యాలయానికి శ్రీకాకుళం, విశాఖ నుండి రావాలంటే ఒక రోజు ముందుగా తయారు కావాలి. కర్నూలుకు రైలు మార్గం లేదు. అనంతపురం నుండి శ్రీకాకుళానికి టేప్ పెట్టి కొలచినా కూడా అమరావతి సెంటర్ అవుతుంది. ఇంకా మంగళగిరిలోని ఆర్టీఐ భవనం, దాని కిందా పైనా కూడా కార్యాలయాలు అద్దె భవనంలోనే ఉన్నాయి. వాటిని కుడా అమరావతి మారిస్తే లక్షలాది రూపాయల అద్దె మిగులుతుంది. అసలే అప్పుల్లో ఉన్న రాష్ట్రానికి కొంత ఊరట కలుగుతుంది.

- నార్నె వెంకట సుబ్బయ్య,
భారత హేతువాద సంఘం అధ్యక్షుడు.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com



శంకరరావుకు స్వాగతం పలుకుతున్న ఎంఎల్‌ఎ

పర్యాటకరంగ అభివృద్ధికి కృషి

- ఎస్‌టి కమిషన్‌ ఛైర్మన్‌ డివిజి శంకరరావు

ప్రజాశక్తి - పోలవరం

గిరిజన ప్రాంతాల్లో పర్యాటక విస్తరణ చేయడం కోసమే పర్యటన చేస్తున్నట్లు ఎస్‌టి కమిషన్‌ ఛైర్మన్‌ డివిజి శంకరరావు తెలి పారు. రాజ మహేంద్రవరం నుం చి పోలవరం ప్రా జెక్టుకు చేరుకున్న ఆయన అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పోశమ్మగండి ప్రాం తానికి చేరుకున్నారు. ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, రంపచోడవరం సిఐ సాయిప్రశాంత్‌, పోలవరం సిఐ బాలసురేష్‌బాబు, ఎస్‌ఐ పవన్‌కుమార్‌ వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పర్యాటకం అభివృద్ధి చేయడం వల్ల ప్రాజెక్టు నిర్మాణంలో నష్టపోయిన స్థానికులకు వ్యాపార వాణిజ్యాలు పెరిగి కొంతమేర న్యాయం జరుగుతుందని ఎస్‌టి కమిషన్‌ ఛైర్మన్‌కు వివరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సహాయ సహకారాలందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

డబ్ల్యుఇఎఫ్‌ వార్షిక సదస్సు ప్రారంభం

- భారత్‌ నుంచి భారీ బృందం



దావోస్‌ : స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్‌ ఎకనామిక్‌ ఫోరం (డబ్ల్యుఇఎఫ్‌) వార్షిక సదస్సు 2025 సోమవారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు వివిధ దేశాల నాయకులు, అధికారులు, వ్యాపార వేత్తలు హాజరుకానున్నారు. ఈ సదస్సుకు తొలిసారిగా భారత్‌ భారీ బృందాన్ని పంపింది. భారత్‌ బృందంలో ఐదుగురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, మహారాష్ట్రల ముఖ్యమంత్రులు, వివిధ రాష్ట్రాలకు చెందిన అనేకమంది మంత్రులతోపాటు దాదాపు వంద మంది సిఇఒలు, ఇతర అధికారులు ఉన్నారు. సోమవారం ఈ సదస్సులో దక్షిణాఫ్రికా ఆర్థిక మంత్రి ఎనోక్‌ గోడోంగ్వానా మాట్లాడుతూ 'దక్షిణాఫ్రికాలో ఆర్థిక వృద్ధి రేటును పెంచడానికి నిర్మాణాత్మక సంస్కరణల అమలుపై దృష్టి కేంద్రీకరించినట్లు' తెలిపారు. అమెరికా నూతన అధ్యక్షులు డొనాల్డ్‌ ట్రంప్‌ ఈ నెల 23న వర్చువల్‌గా ఈ సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఉక్రెయిన్‌ అధ్యక్షులు జెలెన్‌స్కీ ఈ నెల 21న సమావేశానికి హాజరై ప్రసంగిస్తారని డబ్ల్యుఇఎఫ్‌ నిర్వాహకులు తెలిపారు. డబ్ల్యుఇఎఫ్‌ ఇటీవల నిర్వహించిన సర్వేలో ఆర్థిక అభివృద్ధికి సాయుధ పోరాటాలు, వాతావరణ మార్పులు విఘాతంగా మారతాయని సర్వే తెలిపింది.

అమెజాన్‌కు నిరసన సెగ

దావోస్‌లో అమెజాన్‌ సంస్థకు వాతావరణ ఉద్యమ కార్యకర్తల నుంచి నిరసన సెగ తగిలింది. అమెజాన్‌ బేస్‌కు కార్యకర్తలు పచ్చ రంగు పులిమారు. అమెజాన్‌ హెలికాప్టర్లు ల్యాండింగ్‌కు అంతరాయం కలిగించారు. వెంటనే స్విస్‌ పోలీసులు రంగంలోకి దిగి నిరసనకారులను నిలువరించారు.

కిడ్నాప్‌ కేసులో నిందితుడు అరెస్ట్‌

ప్రజాశక్తి - సీతానగరం (ఏలూరు జిల్లా)

బాలికను కిడ్నాప్‌ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన పండుదేని దుర్గాప్రసాద్‌ అనే వ్యక్తి రఘుదేవపురం గ్రామంలో ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న బాలికను కిడ్నాప్‌ చేసాడు. ఈ మేరకు పోలీసులు గాలింపు చేపట్టారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో కారులో బాలికతో పాటు నిందితుణ్ణి పోలీసులు పట్టుకున్నారు. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరిచారు. నిందితునికి 14 రోజులు రిమాండ్‌ విధించారని సీతానగరం ఎస్‌ఐ తెలిపారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- మెగా జాబ్‌ మేళాలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి (ఏలూరు జిల్లా)

రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని యువతకు అమరరాజా కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆగిరిపల్లి సమీపంలోని గోపాలపురం ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాబ్‌ మేళాలో పదో తరగతి, ఇంటర్‌, ఐటిఐ, చదివిన సుమారు 300 మంది నిరుద్యోగులు పాల్గొనగా వారికి అమర్‌ రాజా సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి వారిలో సుమారు 120 మందికి ఉద్యోగ నియామక పత్రాలను మంత్రితో కలిసి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే అవసరం లేకుండా కళాశాలల్లోనే కంపెనీలను నిర్వహించి పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో స్కిల్‌హబ్‌లు ఏర్పాటుచేసి, యువతకు అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ కళాశాల ఛైర్మన్‌ ఆర్‌.వెంకట్రావు, అమర్‌ రాజా కంపెనీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, రాజేంద్ర, సాంబశివరావు, రోశయ్య, టిడిపి నాయకులు ఎన్‌.వేణు, రఘు, ఆది, గణేష్‌, మాధవరావు, మహేంద్ర వర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెస్‌ ఛార్జీల భారంపై.. ఎయు విద్యార్థుల ఆందోళన



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ఆంధ్ర యూనివర్సిటీలో ఇటీవల కాలంలో పెంచిన మెస్‌ ఛార్జీలను తగ్గించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన సోమవారం ఆంధ్ర యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌ కార్యాలయం ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. వారినుద్దేశించి సంఘం ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ విద్యాలయంలోని మెస్‌ ఛార్జీలు పెరగడంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్లను అభివృద్ధి చేయకుండా హాస్టల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ పేరుతో ప్రతి ఇద్దరి నుంచి రూ.750, టర్మ్‌ ఛార్జ్‌ పేరుతో రూ.400 వసూలు చేస్తున్నారని, విద్యార్థులపై కరెంట్‌ బిల్లుల భారం మోపుతున్నారని తెలిపారు. హాస్టల్‌ రూమ్‌లో ఒక ఫ్యాన్‌, ఒక లైటుకు రూ.350 కరెంటు బిల్లు వసూలు చేస్తున్నారన్నారు. సమస్యలపై ఇప్పటికే నాలుగుసార్లు వినతులు సమర్పించినప్పటికీ ఎయు అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇతర విశ్వ విద్యాలయాలలో గరిష్ఠంగా మెస్‌ ఛార్జీలు రూ.3 వేలు వసూలు చేస్తుంటే, ఎయులో రూ.3900 - రూ.4200 వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. తరగతులు ప్రారంభమైనా మెస్‌లను పూర్తిస్థాయిలో తెరవకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లి తినాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.అజయ్‌, పి.సాయి పాల్గొన్నారు.

కమిటీ ఏర్పాటు

విద్యార్థుల ఆందోళనపై యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ధనుంజయరావు స్పందించారు. సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం సాయంత్రం 9 మందితో కూడిన కమిటీని ఆయన ఏర్పాటు చేశారు.

ద్రావిడ యూనివర్సిటీలో న్యాక్‌ టీమ్‌ మూడు రోజుల పర్యటన

ప్రజాశక్తి- గుడిపల్లి (చిత్తూరు)

ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈనెల 22, 23, 24న న్యాక్‌ టీమ్‌ పర్యటన సందర్శించనుంది. ఏడుగురు సభ్యులతో కూడిన న్యాక్‌ పీర్‌ టీమ్‌ మూడు రోజుల పాటు వర్సిటీలోని ప్రతి విభాగాన్ని సందర్శించి వర్సిటీ గ్రేడింగ్‌ కోసం నివేదిక సమర్పించనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విశ్వవిద్యాలయం ఈ మధ్యనే క్లాస్‌ రూమ్స్‌, వసతి గహాలను శంకుస్థాపన చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. అదేవిధంగా ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరగడం విద్యార్థులకు అన్ని రకాల ల్యాబ్స్‌, ఈ క్లాస్‌ రూమ్స్‌, నైపుణ్యంతో కలిగిన అధ్యాపకులతో ఉత్తమ బోధనా తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయం న్యాక్‌ మంచి గ్రేడ్‌ సాధిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాక్‌ టీమ్‌ సందర్శన కోసం వర్సిటీలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి అయ్యింది.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

- రేణిగుంట-కడప హైవేపై దుర్ఘటన

ప్రజాశక్తి - రేణిగుంట

దైవదర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో తెలంగాణకు చెందిన భార్యాభర్తలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన సోమవారం తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కుక్కలదొడ్డి గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణాలోని సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువుకు చెందిన సందీప్ (45), భార్య అంజలీదేవి(40), తమ ఇద్దరు పిల్లలతో కలిసి కారులో శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి వచ్చారు. దర్శనం అనంతరం సోమవారం ఉదయం తిరుగు ప్రయాణం అయ్యారు. రేణిగుంట సమీపంలోని కుక్కలదొడ్డి వద్ద ఒక్కసారిగా కోతుల గుంపు కారుకు అడ్డుగా రావడంతో వాటిని తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి కోడూరు వైపు నుంచి తిరుపతి వస్తున్న ట్రావెల్ బస్సును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న సందీప్, ఆయన భార్య అంజలీదేవి అక్కడికక్కడే మృతి చెందారు. పిల్లలకు గాయాలవడంతో 108 వాహనంలో సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య కాసారంలో అల్లాడపాలెం

- నేల, నీరు, పాడి పంటలు కలుషితం
- జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యయన యాత్ర



కందివలస గెడ్డను పరిశీలిస్తున్న అధ్యయన బృందం

ప్రజాశక్తి- పూసపాటిరేగ (విజయనగరం జిల్లా)

కాలుష్యం కారణంగా విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని పలు గ్రామాల్లో నేల, నీరు, పాడి పంటలు విషతుల్యమయ్యాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్ అన్నారు. జెవివి ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా జెవివి బృందం మండలంలోని అల్లాడపాలెం, కొణతాల పాలెం, చోడవరం గ్రామాల్లో పర్యటించింది. ఆయా గ్రామాల సమీప నదిలో కాలుష్యంతో నిండిన నీటిని నాయకులు పరిశీలించారు. కాలుష్యం వల్ల ఏర్పడ్డ ఇబ్బందులను అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అధ్యయన బృందం ఎదుట గ్రామస్తులు తమ గోడును వినిపించుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌గోపాల్ మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సరిహద్దులో ఉన్న ఫార్మా కంపెనీలు యధేచ్ఛగా వ్యర్థ జలాలను బయటకు వదిలేస్తున్నాయన్నారు. దీనివల్ల సమీప గ్రామాలు కాలుష్య, విష ప్రభావానికి లోనవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీలు వెదజల్లుతున్న వ్యర్థాల వల్ల అల్లాడపాలెం, కొణతాలపాలెం ప్రజలు విలవిల్లాడిపోతున్నారన్నారు. ఇక్కడ నేల, నీరు పాడి పంటలు విషతుల్యం కావడంతో ఆయా గ్రామాల ప్రజల బతుకు దినదిన గండంగా మారిందన్నారు.

విషతుల్యంగా కందివలస గెడ్డ

విజయనగరానికి సరిహద్దులో ప్రవహిస్తున్న కందివలస గెడ్డలోకి అక్కడున్న కంపెనీలు వాటి వ్యర్థాలను కుమ్మరిస్తుండడంతో గెడ్డ మొత్తం కలుషితమైందని రాజ్‌గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో, ఆ గెడ్డ పరీవాహక ప్రాంతాల గ్రామాలు తీవ్ర కాలుష్య ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పంట పొలాలు కాలుష్యం భారినపడి దిగుబడి రావడం లేదని, పండిన పంట తినడానికి పనికిరాని పరిస్థితి దాపురించిందన్నారు. అనేకసార్లు తమ గోడును ప్రజలు ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు వినిపించినా పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాలేదన్నారు. కంపెనీల యాజమాన్యాలు వ్యర్థాల నివారణకు తగు చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ చూపించడం లేదని ప్రజలు తమ బృందం ముందు ఆవేదన వ్యక్తం చేసినట్టు జెవివి నాయకులు తెలిపారు.

తమ అధ్యయనంలో గుర్తించిన అంశాలను జిల్లా అధికారులకు, సంంధిత ప్రజా ప్రతినిధులకు నివేదిస్తామని నాయకులు తెలిపారు. కంపెనీల యాజమాన్యాలు సామాజిక బాధ్యతలో భాగంగా అవసరమైన నిధులను కేటాయించి వ్యర్థాల నివారణకు బాధ్యత వహించాలని, ఒకవేళ బాధ్యత వహించని పక్షంలో ఆయా యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఈ అధ్యయన యాత్రలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి దివాకర్, కె.మురళీబాబు, జిల్లా కోశాధికారి సిహెచ్ సింహాచలం, పట్టణ కార్యదర్శి కె.శశిధర్ సమతా విభాగం నాయకులు జి.నిర్మల , డాక్టర్ చిన్నారి, కల్చరల్ విభాగం నాయకులు వి. మోహనరావు , సువ్వాడ అప్పలనాయుడు, రమణ సత్యారావు జిల్లా పర్యావరణ సబ్ కమిటీ నాయకులు డి. ఈశ్వరరావు, యూత్ కమిటీ సభ్యులు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్లెమింగో ఫెస్టివల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా తడ మండలం నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సోమవారంతో ముగిసింది. ప్రకృతి ఒడిలో పక్షుల వీక్షణ సందర్శకులకు అందమైన అనుభూతిని మిగిల్చింది. మూడో రోజు మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ విచ్చేశారు. నేలపట్టు పక్షుల అభయారణ్యాన్ని కలెక్టర్ సందర్శించారు. పలువురు విద్యార్థులు, పర్యాటకులతో మాట్లాడి వారి అనుభూతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సులో పెలికాన్ పక్షులు చేపలను ఆహారంగా తీసుకొని వాటి సంతతిని పెంపొందించుకొని తిరిగి వాటి సొంత ప్రాంతానికి వెళ్తాయని తెలిపారు. ఈ సరస్సు పర్యావరణం సమతుల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని, ప్లాస్టిక్ వాడకాన్ని ఈ పరిసర ప్రాంతాల్లో వినియోగించరాదని కోరారు. పర్యాటకుల సందర్శనార్థం వారికి గైడ్లను ఏర్పాటు చేయడంతో పాటు తగినంత భద్రత, మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు.

బస్సుల్లో విద్యార్థుల తరలింపు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఫ్లెమింగో పండుగను తిలకించేందుకు తరలి వచ్చారు. తిరుపతి జిల్లాలోని మూడు డివిజన్ల (తిరుపతి, పుత్తూరు, గూడూరు) నుండి సుమారు 3600 మంది విద్యార్థినీ, విద్యార్థులు, 370 మంది ఉపాధ్యాయులు నేలపట్టు పక్షులు రక్షిత కేంద్రం, అటకానితిప్ప పక్షులు రక్షిత కేంద్రాలను సందర్శించారు. ఆట పరికరాలతో ఆడుకున్నారు. ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. కేవలం రాష్ట్రం నుంచే కాకుండా చెన్నై, బెంగుళూరు రాష్ట్రాల నుంచి పర్యాటకులు సందర్శించారని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ తెలిపారు.

శ్రీవారి అన్నప్రసాదం మెనూలో 'మసాలా'వడ

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి అన్నప్రసాదం మెనూలో ఒక ఐటమ్ పెంచాలని చైర్మన్ ఆదేశాలకు అనుగుణంగా బోర్డులో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఐదు వేల మసాలా వడలను టిటిడి సిబ్బంది యాత్రికులకు వడ్డించారు. ఉల్లిపాయలు, వెల్లుల్లి లేకుండా మసాలా వడ తయారు చేశారు. మసాలా వడలు రుచికరంగా ఉన్నాయని యాత్రికులు సంతృప్తి వ్యక్తం చేశారు. లోటుపాట్లను సరి జేసుకుని పూర్తి స్థాయిలో మెనూలో మార్పులు తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. త్వరలోనే టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

కడప బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కడప జిల్లా దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను టిటిడి ఇఒ జె.శ్యామలరావు ఆవిష్కరించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని ఇఒ ఛాంబర్లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. జనవరి 28 నుండి ఫిబ్రవరి 7వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

యూనివర్సల్ బయో ఫ్యూయల్ మూసివేతకు ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో ఉన్న యూనివర్సల్ బయో ఫ్యూయల్ పివిటి లిమిటెడ్ కంపెనీని మూసివేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాలు జారీ చేశారు. కంపెనీ నుంచి వెలువడే కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదుతో ఎపిఐఐసి, ఐడిఎ వాకలపూడి బోర్డు అఫీషియల్‌తో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ కమిటీ డిసెంబర్ 20, 21వ తేదీల్లో పర్యటించి కంపెనీని తనిఖీ చేయగా అనుమతి లేని ముడి పదార్థాలు, జంతువుల కొవ్వును వినియోగిస్తున్నట్లు గుర్తించారని, తద్వారా పొల్యూషన్ సమీప ప్రాంతాలకు దుర్వాసన వస్తుందని గుర్తించి నోటీసు జారి చేయడం జరిగిందన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిర్ణయం మేరకు సదరు యూనివర్సల్ బయో ఫ్యూయల్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని క్లోజ్ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

దేశీయ తయారీని ప్రోత్సహించాలి

వచ్చే బడ్జెట్‌పై ఎంఐసి ఎలక్ట్రానిక్స్ సిఇఒ

న్యూఢిల్లీ : కేంద్రం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ భారతీయ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు అత్యంత కీలకం కానుందని ఎంఐసి ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సిఇఒ రక్షిత్ మాథుర్ పేర్కొన్నారు. రాబోయే 2025 ఫిబ్రవరి1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో వృద్ధి, ఆవిష్కరణలను పెంపొందించడానికి పరిశ్రమ స్నేహపూర్వక విధానాలు అవసరమన్నారు. దేశీయ తయారీని బలోపేతం చేసే విధంగా ఆర్‌అండ్‌డి కార్యక్రమాలను ప్రోత్సహించే రీతిలో ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టాలని కోరారు. అప్పుడే ప్రపంచవ్యాప్తంగా భారత ఉత్పత్తులు పోటీ పడటానికి వీలు కలుగుతుందన్నారు.

భారీ ప్రతిపాదనలే

- బడ్జెట్‌పై శాఖల విస్తృత కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కోసం అన్ని శాఖలు కసరత్తు ముమ్మరం చేస్తున్నాయి. కీలక శాఖల నుంచి ఇందుకోసం భారీ ప్రతిపాదనలే సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అది ఎంతలా అంటే కేటాయింపులకు వీలు కాని విధంగా ఈ ప్రతిపాదనలు ఉంటున్నట్లు సమాచారం. వాస్తవానికి కావాల్సిన మొత్తం కన్నా అధికంగా నిధులు కోరుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా కొన్ని పెద్ద శాఖలు సిద్ధం చేస్తున్న ప్రతిపాదనలైతే వేల కోట్లలో ఉంటున్నట్లు సమాచారం. ఫిబ్రవరి మూడో వారంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికోసం ఇప్పటికే అన్ని శాఖలకు ఆర్థికశాఖ నిర్ధిష్ట మార్గదర్శకాలతో సర్క్యులర్ జారీ చేసింది. ఏయే రంగాల్లో, ఎలాంటి తరహాలో ప్రతిపాదనలు పంపించాలన్నది కూడా స్పష్టం చేసింది. అనేక శాఖలు ఈ మార్గదర్శకాలను పట్టించుకోకుండానే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా నీటిపారుదల, పంచాయితీరాజ్, పట్టణాభివృద్ధి, విద్య, వైద్యం వంటి శాఖలు తయారుచేస్తున్న ప్రతిపాదనలు పరిమితి దాటి ఉంటున్నట్లు తెలిసింది.

అలాగే చిన్న చిన్న శాఖలు కూడా అవసరాలకు మించే ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది వ్యయానికి అనుగుణంగానే కొత్త ప్రతిపాదనలు ఉండాలన్నది ఆర్థికశాఖ మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొంది. కేటాయించిన నిధులు ఎంత, విడుదల చేసిన మొత్తం, అందులో ఖర్చు చేసినది ఎంత అన్నది అధ్యయనం చేసిన తరువాతే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్దేశించింది.

అమెరికాలో కాల్పులు
హైదరాబాద్ యువకుడు మృతి

- కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అమెరికాలో దుండగుడి కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన కొయ్యడ చంద్రమౌళి కుమారుడు రవితేజ(25) 2022 మార్చిలో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. ఇటీవల విద్యాభ్యాసం పూర్తి చేసిన అతను వాషింగ్టన్‌లోని ఒక మాల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం మాల్‌లో ఉన్న సమయంలో రవితేజపై ఒక దుండగుడు కాల్పులు జరపగా అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుని మృతి విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

మృతదేహాన్ని తీసుకురావడానికి చర్యలు : సబితా ఇంద్రారెడ్డి


రవితేజ తల్లిదండ్రులను మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పరామర్శించారు. అమెరికాలో కెటిఆర్‌కు ఉన్న పరిచయాలతో రవితేజ మృతదేహానికి దేశానికి త్వరగా తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. అదే విధంగా ప్రభుత్వ పరంగా కూడా సహకారం తీసుకుంటానని చెప్పారు. ఉన్నత చదువులు కోసం అమెరికా వెళ్లి రవితేజ ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం అన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నాయకులు న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సాజిద్, నవీన్, రమేష్ కురుమ ఉన్నారు.

టీమిండియా విధ్వంసకర బ్యాటర్, టి20 స్పెషలిస్ట్ రింకూ సింగ్.. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ (లోక్‌సభ) ప్రియా సరోజ్ పెళ్లాడబోతున్నాడు. ఈ విషయాన్ని ప్రియా తండ్రి, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే తూఫానీ సరోజ్ ధృవీకరించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు అనంతరం రింకూ, ప్రియా ఎంగేజ్‌మెంట్, పెళ్లి తేదీలను వెల్లడిస్తామని తూఫానీ సరోజ్ తెలిపారు.

కుబేరుల బొజ్జలు నిండుతున్నాయ్

- ట్రిలియనీర్లుగా మారుతున్న బిలియనీర్లు,
- సంపదే కాదు... పెత్తనమూ పెరుగుతోంది
- దిగజారుతున్న పేదల బతుకులు
- ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : ప్రపంచంలో కోటీశ్వరుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. 2023తో పోలిస్తే గత సంవత్సరం వారి సంపద రెండు ట్రిలియన్ డాలర్లు పెరిగి పదిహేను ట్రిలియన్ డాలర్లకు చేరింది. అంటే 2023లో కంటే 2024లో వారి సంపద మూడు రెట్లు పెరిగిందన్న మాట. ప్రపంచంలోని కుబేరులందరూ సోమవారం కొలరాడోలోని స్కై రిసార్ట్ పట్టణంలో వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరులపై ఓ ఆసక్తికరమైన అధ్యయనం వెలుగు చూసింది. ప్రతి ఏటా ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సమావేశం ప్రారంభమయ్యే రోజు ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సంస్థ అసమానతలపై ఓ నివేదిక విడుదల చేస్తుంది. 1990 నుండి పేదల సంఖ్యలో ఎలాంటి మార్పు రానప్పటికీ కోటీశ్వరుల సంపద మాత్రం అమాంతం పెరిగిపోతోందని ఈ నివేదిక తెలిపింది. గత సంవత్సరం ఆసియాలో కుబేరుల సంపద ఏకంగా 299 బిలియన్ డాలర్లు పెరిగిందని, రాబోయే దశాబ్ద కాలంలో కనీసం ఐదుగురు ట్రిలియనీర్లు ఉంటారని ఆక్స్‌ఫామ్ చెబుతోంది.



పెరుగుతున్న కోటీశ్వరుల జాబితా

ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో గత సంవత్సరం 204 మంది చేరారు. అంటే ప్రతి వారానికి సగటున సుమారు నలుగురు వ్యక్తులు కుబేరులు అవుతున్నారన్న మాట. గత సంవత్సరం ఒక్క ఆసియాలోనే కోటీశ్వరుల జాబితాలో కొత్తగా 41 మంది చేరారు. ఉత్తర అమెరికా, యూరప్‌లోని సంపన్న, శక్తివంతమైన దేశాలలో నివసిస్తున్న ఒక శాతం కుబేరులు 2023వ సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థల ద్వారా యూరప్, ఉత్తర అమెరికా వెలుపల ఉన్న ప్రాంతాల నుండి గంటకు 30 మిలియన్ డాలర్లు కొల్లగొట్టారని ఆక్స్‌ఫామ్ తన నివేదికలో తెలియజేసింది. కోటీశ్వరుల సంపదలో 60 శాతం వారసత్వం, గుత్తాధిపత్యం, క్రోనీ సంబంధాల నుండి పొందినదేనని 'టేకర్స్... నాట్ మేకర్స్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఆక్స్‌ఫామ్ ఎత్తిచూపింది. అత్యంత సంపన్నులైన వారి ఆర్జనలో ఎక్కువభాగం గౌరవప్రదంగా పొందిందేమీ కాదని అంటూ అసమానతలను తగ్గించేందుకు, అధిక సంపదకు స్వస్తి పలికేందుకు, కొత్తగా పుట్టుకొచ్చిన దొరతనాన్ని అంతం చేసేందుకు వీలుగా ప్రపంచంలోని కుబేరులపై ఆయా దేశాల ప్రభుత్వాలు పన్నులు విధించాలని హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పెత్తనమూ పెరుగుతోంది

గత ఏడాది కుబేరుల సంపద రోజుకు సగటున 5.7 బిలియన్ డాలర్ల చొప్పున పెరిగింది. 2023లో బిలియనీర్ల సంఖ్య 2,565 నుండి 2,769కి పెరిగింది. ప్రపంచంలో అత్యంత సంపన్నులైన పది మంది సంపద రోజుకు సగటున వంద మిలియన్ డాలర్ల చొప్పున పెరిగింది. ఒకవేళ వారు రాత్రికి రాత్రే తమ సంపదలో 99 శాతాన్ని కోల్పోయినప్పటికీ వారు కోటీశ్వరులుగానే మిగులుతారని ఆక్స్‌ఫామ్ తేల్చి చెప్పింది. నేడు అసమానతలు గరిష్ట స్థాయికి చేరడం వెనుక అక్రమ సంపద, వలసవాదం శక్తివంతంగా పనిచేస్తున్నాయి. కోటీశ్వరుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరగడానికి కూడా ఇవే కారణం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం కొందరి చేతిలో బందీగా ఉండిపోయింది. బిలియనీర్లకు అడ్డుకట్ట వేయడంలో జరుగుతున్న వైఫల్యం కారణంగా ట్రిలియనీర్లు పుట్టుకొస్తున్నారు. కోటీశ్వరుల సంపద మాత్రమే పెరగడం లేదు... దానితో పాటు వారి పెత్తనం కూడా పెరుగుతోందని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ చెప్పారు.

'కుబేరుడైన దేశాధ్యక్షుడు. ఆయనను తీసుకొచ్చి మద్దతు ఇచ్చిన ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తి ఎలాన్ మస్క్... ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థను నడపబోతున్నారు. మేము ఈ నివేదికను ఒక మేలుకొలుపుగా అందిస్తున్నాము. కొద్దిమంది చేతిలో ఉన్న అంతులేని సంపద కారణంగా ప్రపంచంలోని సామాన్య ప్రజలు నలిగిపోతున్నారు' అని అమితాబ్ బెహర్ తెలిపారు.

వారసత్వంగా వచ్చిందే

ఆక్స్‌ఫామ్ అంచనా ప్రకారం కోటీశ్వరుల సంపదలో 36 శాతం వారసత్వంగా వచ్చి పడిందే. 30 సంవత్సరాల లోపు వయసున్న ప్రతి కోటీశ్వరుడికీ సంపద వారసత్వంగానే సంక్రమించిందని ఫోర్బ్స్ పరిశోధన తేల్చింది. ఇవాళ కోటీశ్వరులుగా ఉన్న వెయ్యి మంది రాబోయే రెండు మూడు దశాబ్దాలలో 5.2 ట్రిలియన్ డాలర్ల సంపదను తమ వారసులకు అప్పగిస్తారని యుబిఎస్ అనే అంతర్జాతీయ సంస్థ అంచనా. యూరప్‌లోని అత్యంత సంపన్నులు పేద దేశాలను దోచుకోవడం, చారిత్రక వలసవాదం కారణంగా కుబేరులయ్యారని ఆక్స్‌ఫామ్ తెలిపింది.

ధనిక దేశాల ఆధిపత్యం

అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ధనిక దేశాలు 69 శాతం ప్రపంచ సంపద పైన, 77 శాతం కోటీశ్వరుల సంపద పైన పెత్తనం చెలాయిస్తున్నాయి. ప్రపంచ కుబేరుల్లో 68 శాతం సంపన్న దేశాలలో నివసిస్తున్న వారే. అయితే ప్రపంచ జనాభాలో వారి సంఖ్య కేవలం 21 శాతమే. విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం ప్రతి దేశంలోనూ డబ్బు అవసరమవుతుంది. కానీ ఆ సొమ్ము సంపన్నుల బ్యాంక్ ఖాతాలకు చేరుతోంది. ఇది ఆర్థిక వ్యవస్థకే కాకుండా మానవ జాతికి కూడా నష్టదాయకమేనని బెహర్ తెలిపారు. రోజుకు కేవలం 6.85 డాలర్లతో జీవిస్తున్న వారి సంఖ్యలో 1990 నుండి పెద్దగా మార్పేమీ రాలేదని ప్రపంచబ్యాంక్ చెబుతోంది. అయితే కోవిడ్ సమయంలో... అంటే 2021లో కూడా కోటీశ్వరుల సంపద 5.8 ట్రిలియన్ డాలర్ల మేర పెరిగింది.

అమిత్ షా పై వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు ఊరట



న్యూఢిల్లీ : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బిజెపిపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018లో బెంగళూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ... అమిత్ షా ఓ హత్య కేసులో నిందితులని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బిజెపి కార్యకర్త నవీన్ ఝా పరువు నష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని రాహుల్ చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించడంతో, రాహుల్.. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార్ఖండ్ కోర్టు నిరాకరించింది. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో రాహుల్‌గాంధీ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బిజెపి నేత నవీన్ ఝాకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం వారిని ఆదేశించింది.

శ్వేత సౌధంలో మళ్లీ ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

జడ్జి బ్రెట్ కవనౌంగ్ ప్రమాణస్వీకారం నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ శ్వేత సౌధంలో అడుగుపెట్టడం ఇది రెండోసారి. అధ్యక్షుడి ప్రమాణస్వీకార కార్యక్రమం రొతుండలో నిర్వహించడం గత 40 ఏళ్లలో ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమంలో అధ్యక్షపదవి నుంచి వైదొలగిన జో బైడెన్‌తో పాటు మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యు బుష్, బరాక్ ఒబామాలు తమ భార్యలతో సహా హాజరయ్యారు. అలాగే అర్జెంటీనా అధ్యక్షులు జేవియర్ మిలే, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని హాజరయ్యారు. చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ హాజరు కావాల్సి ఉన్నా చివరికి చైనా నుంచి సీనియర్ రాయబారి హాజరయ్యారు. అలాగే భారత ప్రభుత్వం తరపున కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే టెస్లా, స్పేస్‌ఎక్స్ సిఇఒ ఎలోన్ మస్క్, అమెజాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జెఫ్ బెజోస్, మెటా ప్లాట్‌ఫారమ్‌ల సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్‌తో పాటు ఇతర మిలియనీర్లు హాజరయ్యారు.

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తరువాత ట్రంప్ మాట్లాడుతూ, 'అమెరికాకు స్వర్ణయుగం ఇప్పుడే ప్రారంభమవుతుంది' అని వ్యాఖ్యానించడం విశేషం. 'ఈ రోజు నుంచి మన దేశం అభివృద్ధి చెందుతుంది, ప్రపంచవ్యాప్తంగా మళ్లీ గౌరవించబడుతుంది' అని కూడా ట్రంప్ తెలిపారు. ట్రంప్ ప్రమాణస్వీకారానికి ముందు బైడెన్‌తో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్ వివిధ దేశాల నాయకులు అభినందనలు తెలిపారు. రష్యా అధ్యక్షులు పుతిన్ ట్రంప్‌ను అభినందించారు. ఉక్రెయిన్, అణ్వాయుధాలపై అమెరికా కొత్త ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మోడీ అభినందన

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన మితవాద రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్‌ను ప్రధాని నరేంద్రమోడీ అభినందించారు. ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెడుతూ, " మైడియర్ ఫ్రెండ్ ప్రెసిడెంట్ అమెరికా అధ్యక్షుడిగా చారిత్రాత్మక ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా మీకు ఇవే నా అభినందనలు. మీతో మరోసారి సన్నిహితంగా కలసి పనిచేసే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను" అని పేర్కొన్నారు.

సాక్షులను బెదిరిస్తున్న ఆశిష్ మిశ్రా

- విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్‌పికి 'సుప్రీం' ఆదేశం

లఖింపూర్ : ఉత్తర ప్రదేశ్ లఖింపూర్ కేసులో నిందితుడు ఆశిష్‌మిశ్రా సాక్షులను బెదిరిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరపాలని ఎస్‌పిని సుప్రీంకోర్టు ఆదేశించింది. లఖింపూర్‌లో 2021 అక్టోబర్ 3న నిరసన తెలుపుతున్న రైతులపైకి కారుతో దూసుకుపోయి, వారి మరణానికి కారణమైన కేసులో ప్రధాన నిందితుడు, కేంద్ర మాజీ మంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా. నిందితుడు సాక్షులను ప్రభావితం చేశారని, బెదిరించారని వచ్చిన ఆరోపణలపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని లఖింపూర్ ఖేరీ ఎస్‌పికి సూచించింది. ఈ ఆరోపణలను నిందితుడు తరపు న్యాయవాది సిద్ధార్థ్ దవే తోసిపుచ్చారు. సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేసేందుకు ఇలాంటి వాదనలు చేస్తున్నారని దవే అన్నారు. కేసులో ముఖ్యమైన సాక్షులను ప్రభావితం చేసేందుకు ఆశిష్‌మిశ్రా ప్రయత్నించినట్లుగా తన వద్ద ఆడియో రికార్డింగ్‌లున్నాయని ఫిర్యాదుదారుల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ స్పష్టం చేశారు. బెయిల్ షరతులను ఉల్లంఘించి ఆశిష్ మిశ్రా బహిరంగ సభలో పాల్గొన్నారని చెప్పారు. వెంటనే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ప్రశాంత భూషణ్ తెలిపిన ఆధారాలను సేకరించి ఎస్‌పికి పంపించాలని ఉత్తరప్రదేశ్ న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఆరోపణలపై స్పందించాలని ఆశిష్‌మిశ్రాను కోరింది. ఆ మెటీరియల్ నిజాయితీని, వాస్తవికతను, విశ్వసనీయతను తనిఖీ చేసి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఎస్‌పిని కోర్టు ఆదేశించింది. రోజువారీ విచారణ జరపాలన్న ప్రశాంత్‌భూషణ్ విజ్ఞప్తిని ధర్మాసనం తిరస్కరించింది. నాలుగు వారాల తర్వాత విచారణ జరపనున్నట్లు పేర్కొంది.

ఎన్‌కౌంటర్‌కు పోలీసులదే బాధ్యత

- మేజిస్ట్రేట్ విచారణలో నిర్ధారణ

ముంబయి : బద్లాపూర్ పాఠశాల లైంగిక వేధింపుల కేసులో నిందితుడు అక్షయ్ షిండే మరణించడానికి ఐదుగురు పోలీసులే కారణమని మేజిస్ట్రేట్ విచారణ నిర్ధారించింది. ఈ మేరకు బాంబే హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో నివేదికను సమర్పించింది. థానే క్రైం బ్రాంచ్ సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ షిండే, అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నీలేష్ మోరే, హెడ్ కానిస్టేబుళ్లు అభిజిత్ మోరే, హరీష్ తవడే, పోలీస్ డ్రైవర్ బాధ్యులుగా నివేదికలో పేర్కొన్నారు. అక్షయ్ షిండేను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారని ఆరోపిస్తూ అతని తండ్రి అన్నా షిండే దాఖలు చేసిన పిటీషన్‌ను హైకోర్టు విచారిస్తున్న సంగతి తెలిసిందే. మేజిస్ట్రేట్ నివేదికను జస్టిస్ రేవతి మోహితే డేరే, జస్టిస్ నీలా గోఖలేలతో కూడిన డివిజన్ బెంచ్ పరిశీలించింది. ఈ నివేదిక ఆధారంగా మహారాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు పోలీసులకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. ఈ కేసును ఏ ఏజెన్సీ దర్యాప్తు చేస్తుందో రెండు వారాల్లోగా తెలియజేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హితేన్ వెనెగాంకర్‌ను కోరింది. విచారణ నివేదిక కాపీని ప్రాసిక్యూషన్‌కు, మృతుని తండ్రి అన్నా షిండేకు కూడా అందజేయాలని ఆదేశించింది. బద్లాపూర్‌లోని ఒక పాఠశాల టాయిలెట్‌లో ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలతో గతేడాది ఆగస్టులో పాఠశాల అటెండర్ అక్షయ్ షిండేను అరెస్టు చేశారు. తలోజా జైలు నుంచి విచారణ కోసం తీసుకెళ్తుండగా నిందితుడు వ్యాన్‌లో ఒక పోలీసు నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపాడని, ఎదురు కాల్పుల్లో మరణించాడని పోలీసులు చెబుతున్నారు.

మూడో ప్రపంచ యుద్ధం రానివ్వను

- అక్రమ వలసదారులను బహిష్కరిస్తా,
- బైడెన్ చర్యలు రద్దు
- టిక్‌టాక్‌లో 50 శాతం వాటా,
- ప్రమాణ స్వీకారానికి ముందు ఓ ర్యాలీలో ట్రంప్



'మాగా' ర్యాలీలో అభిమానులతో కలిసి నృత్యం చేస్తున్న ట్రంప్

వాషింగ్టన్ : మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. దేశ సరిహద్దుల అతిక్రమణను నిరోధిస్తానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన కొద్ది గంటల వ్యవధిలోనే మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న కార్యనిర్వాహక చర్యలన్నింటినీ రద్దు చేస్తానని స్పష్టం చేశారు. టిక్‌టాక్ ఉమ్మడి భాగస్వామ్యంలో అమెరికాకు యాభై శాతం వాటా ఉంటుందని ప్రకటించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ వన్ అరేనాలో జరిగిన మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) విజయోత్సవ ర్యాలీని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. 'అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడు చేయని విధంగా ప్రజలకు అత్యుత్తమమైన మొదటి రోజును, అతి పెద్ద మొదటి వారాన్ని, అత్యంత అసాధారణమైన తొలి వంద రోజులను అందించబోతున్నాము' అని ఆయన చెప్పారు.

ఇక భారీగా 'బహిష్కరణలు'

'రేపు సాయంత్రం సూర్యాస్తమయం అయ్యే లోగా మా దేశంపై అక్రమ వలసదారుల దాడిని నిలిపేస్తాం. సరిహద్దులను అతిక్రమించి అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారు తిరిగి స్వస్థలాలకు పోవాల్సిందే. మా సంపదను తిరిగి దక్కించుకుంటాం' అని ట్రంప్ అన్నారు. అధికార యంత్రాంగం త్వరలోనే దేశ సరిహద్దులను తన నియంత్రణలోకి తీసుకుంటుందని చెప్పారు. అమెరికా చరిత్రలోనే అతి పెద్దదైన 'బహిష్కరణ' ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. వేలాదిమంది అక్రమ ఇమ్మిగ్రెంట్లను స్వదేశాలకు పంపుతామని ఆయన స్పష్టం చేశారు. 'దానికి ముందు బహిరంగ సరిహద్దులు, కారాగారాలు, మానసిక సంస్థలు, మహిళల క్రీడల్ని పురుషులు ఆడడం, ట్రాన్స్‌జెండర్ల గురించి కనీసం ఎవరూ ఆలోచించనైనా ఆలోచించరు. అమెరికా భూభాగంలో అక్రమంగా నివసిస్తున్న వారిని, వలస వచ్చిన నేరగాళ్లను బహిష్కరిస్తాం' అని చెప్పారు.

అదంతా నా ఘనతే

గాజాలో కాల్పుల విరమణకు సంబంధించి కుదిరిన ఒప్పందం తన ఘనతేనని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో తాను అధ్యక్షుడిగా ఉండి ఉంటే యుద్ధమే వచ్చి ఉండేది కాదని అన్నారు. 'మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన కోసం తొలి దశగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించాము. నవంబరులో మన చారిత్రక విజయం కారణంగానే ఇది సాధ్యపడింది.

తొలి బందీ ఇప్పుడే విడుదలయ్యాడు. ఒప్పందాన్ని తానే కుదిర్చానని బైడెన్ చెబుతున్నాడు. మంచిదే... నేను అధ్యక్షుడిగా ఉండి ఉంటే గాజా యుద్ధం జరిగేదే కాదు' అని అన్నారు. బాధ్యతలు చేపట్టబోతున్న తమ అధికార యంత్రాంగం మూడు నెలల కంటే తక్కువ వ్యవధిలోనే ఇదంతా సాధించిందని చెప్పారు. 'వారు నాలుగు సంవత్సరాలు అధ్యక్షులుగా ఉండి చేసిన దాని కంటే అధ్యక్షుడిని కాకపోయినా నేను అంతకంటే ఎక్కువే సాధించాను' అని వ్యాఖ్యానించారు. 'ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేస్తాను. మధ్యప్రాచ్యంలో గందరగోళాన్ని నివారిస్తాను. మూడో ప్రపంచ యుద్ధం జరగకుండా అడ్డుకుంటాను' అని ట్రంప్ చెప్పుకొచ్చారు.

మళ్లీ వచ్చిన టిక్‌టాక్

టిక్‌టాక్‌ను ఆన్‌లైన్‌లోకి తెచ్చిన ఘనత కూడా తనదేనని ట్రంప్ చెప్పారు. చైనీయులకు చెందిన వీడియో – షేరింగ్ యాప్‌ను కాపాడేందుకు అమెరికా ఉమ్మడి భాగస్వామ్యాన్ని నెలకొల్పుతుందని తెలిపారు. 'నేను ప్రమాణస్వీకారం చేయకముందే మీరు ఊహించని ఫలితాలను చూస్తున్నారు. ఇదంతా ట్రంప్ ప్రభావమేనని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. ఈ రోజు టిక్‌టాక్ మళ్లీ వచ్చింది. దానిని మనం కాపాడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే దాని ద్వారా అనేక ఉద్యోగాలను కాపాడగలుగుతాం. మన వ్యాపారాన్ని చైనాకు అప్పగించబోవడం లేదు. టిక్‌టాక్‌లో అమెరికాకు 50 శాతం వాటా ఉండాలన్న షరతు పైనే టిక్‌టాక్‌కు అంగీకరించాను' అని ట్రంప్ తెలిపారు.

దల్లేవాల్ ఆరోగ్యాన్ని కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

వినతిపత్రం పంపాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని, వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రాలు అందించాలని రైతు సంఘాల ప్రతినిధులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వై.కేశవరావు, కెవివి ప్రసాదరావు, డి.హరినాథ్, సింహాద్రి ఝాన్సీ, మరీదు ప్రసాద్‌బాబు, యు.వీరబాబు, కె. విజయబాబు, కె. పోలారి (ఇఫ్టూ) తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఎంపికి వినతి

తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తిని తిరుపతిలోని ఆయన కార్యాలయంలో రైతు సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్ కార్యాలయానికి రైతు సంఘాల నాయకులు రాయబారం నిర్వహించారు. ఎంపికి అందజేయాలని కోరుతూ ఎంపి కార్యాలయ అధికారి కుమారస్వామికి వినతిపత్రం ఇచ్చారు. భీమవరంలోని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కార్యాలయానికి రాయబారం నిర్వహించారు. ఆ కార్యాలయ సిబ్బందికి రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనిని మంత్రి ద్వారా ప్రధాన మంత్రికి పంపాలని విజ్ఞప్తి చేశారు. విజయనగరం ఎపి కలిశెట్టి అప్పలనాయుడుకు అందించాలని కోరుతూ ఆయన వ్యక్తిగత కార్యదర్శికి రైతు సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు.

భారాలు ప్రజలకు... లాభాలు ప్రైవేట్‌కు

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ సంస్థలు అప్పులు, నష్టాల ఊబిల్లోకి కూరుకుపోయాయి. మూడు డిస్కమ్‌లు రూ.66,234 కోట్ల అప్పుల్లో, రూ.36,212 కోట్ల నష్టాల్లో నడుస్తున్నాయి. మూడో దశ సంస్కరణల వల్ల విద్యుత్ సంస్థలకు మరింత అప్పులు, నష్టాల్లోకి కూరుకుపోవడమే కాకుండా వినియోగదారులపై భారాలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తుంది.

అప్పనంగా భూములు అప్పగింత

పునరుత్పాదక విద్యుత్ పేరుతో ప్రైవేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం భూములను అప్పనంగా అప్పగించనుంది. సోలార్ విద్యుత్ ఒక మెగావాట్ ఉత్పత్తి కావాలంటే ఐదెకరాల భూమి అవసరం. పాలసీలో సోలార్ ఉత్పత్తి 78.50 గిగావాట్ల (78,500 మెగావాట్లు)లక్ష్యంగా నిర్దేశించుకుంది. అంటే సోలార్ పవర్ ప్రాజెక్టుల కోసమే 3,92,500 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. పవన విద్యుత్ ఒక మెగావాట్‌కు 2.5 ఎకరాల భూమి అవసరం. 35 గిగావాట్ల పవన విద్యుత్ కోసం 87,500 ఎకరాల భూమిని సమీకరించాల్సి ఉంటుంది. ఇది కాకుండా 22 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. బ్యాటరీ విద్యుత్ నిల్వ (బిపిఎస్) 25 గిగావాట్లు, గ్రీన్ హైడ్రోజన్ 1.50 ఎంటిపిఎ, ఎలక్ట్రికల్ వెహికల్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బయోఫ్యూయల్స్, సోలార్ ఉత్పత్తి ప్రాజెక్టుల ద్వారా 20 గిగావాట్ల లక్ష్యంగా పాలసీలో నిర్దేశించుకుంది.

వీటికి ఎంత భూములు అవసరం అనేది ఇంకా తేలాల్సి ఉంది. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని రకాల (ప్రభుత్వ, రెవెన్యూ, ఇతర) భూములను గుర్తించాల్సిన బాధ్యతను పునరుత్పాదక విద్యుత్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు పెట్టే కంపెనీలే కావాల్సిన చోట భూములు తీసుకునే వెసులుబాటు కూడా కల్పించింది. రైతుల నుంచి తీసుకునే భూములపై 33 ఏళ్లపాటు పూర్తి అధికారాలు కార్పొరేట్లకే ఉంటుంది. ఒప్పంద గడువు ముగిసిన తరువాత కూడా భూములు మరలా రైతులకు దక్కుతాయనే నమ్మకం లేదు. ఇప్పటికే అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణగా ఉన్నాయి.

యుజిసి నిబంధనల ముసాయిదాను ఉపసంహరించుకోండి

- కేంద్రానికి స్టాలిన్ లేఖ
- బిజెపియేతర ముఖ్యమంత్రులకు కూడా..



చెన్నై : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యుజిసి నిబంధనల ముసాయిదా 2024–25పై తమిళనాడు వైఖరిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మరోసారి పునరుద్ఘాటించారు. ఈ ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు స్టాలిన్ సోమవారం లేఖ రాశారు. ఈ ముసాయిదాపై బిజెపియేతర ముఖ్యమంత్రులకు కూడా స్టాలిన్ లేఖ రాశారు. ముసాయిదాకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించిన విషయాన్ని ప్రస్తావించారు. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోనూ ఇలాంటి తీర్మానాన్ని ఆమోదించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు రాసిన లేఖలో ముసాయిదాలోని కొన్ని నిబంధనలు స్టాలిన్ ప్రస్తావించారు. నాలుగేళ్ల కాలపరిమితగల ఎంటెక్, ఎంఇ కోర్సుల్లో అర్హత కోసం నిర్వహించే ప్రవేశపరీక్షపై అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యావేత్తలు కాని వ్యక్తులను కూడా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్లుగా నియమించే నిబంధనపైనా, వైస్ ఛాన్సలర్ సెర్చ్ కమిటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని పక్కనపెట్టడం, క్రాస్– డిసిప్లినరీ టీచర్లు వంటి నిబంధనలపై స్టాలిన్ తన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముసాయిదాలో ఉన్న అనేక నిబంధనలు విశ్వవిద్యాలయాల సమగ్రత, స్వయం ప్రతిపత్తి, సమగ్ర అభివృద్ధికి సవాళ్లుగా ఉన్నాయని స్టాలిన్ విమర్శించారు. తాను వ్యక్తం చేసిన ఆందోళనలపై సమీక్ష నిర్వహించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

బిజెపియేతర ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో ముసాయిదాలోని నిబంధనలు రాష్ట్రాల హక్కులను స్పష్టంగా ఉల్లంఘిస్తున్నాయని స్టాలిన్ విమర్శించారు. విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని విమర్శించారు. అధికారాన్ని కేంద్రీకరించడానికి, దేశ సమాఖ్య నిర్మాణాన్ని బలహీనపర్చే ఇలాంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా మనం ఐక్యంగా నిలబడ్డం చాలా కీలకమని ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో స్టాలిన్ స్పష్టం చేశారు.

జర్నల్ జాబితా రద్దు దుర్మార్గం

- భారత విశ్వవిద్యాలయాల ప్రపంచస్థాయి దెబ్బతింటుంది
- యుజిసి చర్యపై విద్యావేత్తలు, నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : జర్నల్ జాబితా రద్దుపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) చర్యను దేశంలోని విద్యావేత్తలు, నిపుణులు తప్పుబడుతున్నారు. దీనితో నాణ్యతపై ప్రభావం పడుతుందనీ, భారత విశ్వవిద్యాలయాల ప్రపంచస్థాయి దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. పరిశోధకులు, విద్యావేత్తలు విశ్వసనీయమైన జర్నల్స్‌ను గుర్తించటంలో, వారి పత్రాలను ప్రచురించటానికి కొన్ని నాణ్యతా ప్రమాణాలను పాటించటంలో సహాయపడే ప్రచురణల ప్రామాణిక జాబితాను నిలిపివేయాలని యుజిసి ఇటీవలే నిర్ణయించింది. యుజిసి – కన్సార్టియం ఫర్ అకడమిక్స్ అండ్ రీసెర్చ్ ఎథిక్స్ (కేర్) జాబితాను రద్దు చేయాలని కమిషన్ ఇటీవల నిర్ణయించిందని ఇద్దరు యుజిసి అధికారులు చెప్పారు. ఈ నిర్ణయం భారతీయ విశ్వవిద్యాలయాల ప్రపంచస్థాయిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందనిపై దేశంలోని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత యుజిసి నిబంధనల ప్రకారం.. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు కెరీర్ పురోగతికి అర్హత పొందటానికి పరిశోధనా పత్రాలు, పుస్తకాలను ప్రచురించాలి. 2018కి ముందు యుజిసి.. విశ్వవిద్యాలయాల ఇన్‌పుట్‌ల ఆధారంగా ఆమోదం పొందిన జర్నల్స్ జాబితాను దాని ముగింపులో ఎలాంటి సమగ్ర పరిశీలన లేకుండానే నిర్వహించింది. దీంతో ఇది జర్నల్స్ దోపిడీకి తెరలేపినట్టయ్యింది. రచయితలు రుసుము చెల్లించి తమ పత్రాలను ప్రచురించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితుల నేపథ్యంలో నవంబర్, 2018లో యుజిసి.. యుజిసి – కేర్‌ను ప్రారంభించింది. "కేర్ జాబితాను నిలిపివేయాలని యుజిసి నిర్ణయించింది. ఏ ప్రచురణలను అనుసరించాలో నిర్ణయించటానికి విశ్వవిద్యాలయాలు ఉత్తమంగా సరిపోతాయని భావించింది" అని సంస్థ అధికారి ఒకరు తెలిపారు. అయితే, ఈ విషయంలో విశ్వవిద్యాలయాలతో యుజిసి ఎలాంటి సంప్రదింపులూ జరపలేదని ముగ్గురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.



'ఢిల్లీలో బిజెపి విజయాలు' ఖాళీ పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆప్ నేతలు

ఖాళీ పేజీలే బిజెపి ప్రగతి

- ఆప్ విమర్శ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

'ఢిల్లీలో బిజెపి విజయాలు' అనే ఖాళీ పేజీలతో పుస్తకాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ విడుదల చేసింది. సోమవారం నాడిక్కడ ఆప్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆప్ సీనియర్ నేత, రాజ్యసభ పక్షనేత సంజయ్‌సింగ్ మాట్లాడుతూ.. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వివిధ వాగ్దానాలను ప్రస్తావించారు. బిజెపిపై దాడిని తీవ్రతరం చేస్తూ 'మొదటి పేజీలో ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు (బిజెపి) ఎలా ఇచ్చారో, రెండవ పేజీలో ప్రతి పౌరుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు ఎలా జమ అయ్యాయో, ప్రజలు ఎలా సంతోషంగా ఉన్నారో, మూడో పేజీలో దేశంలోని ప్రతి రైతు ఆదాయం ఎలా పెరిగిందో వివరాలు ఉన్నాయి' అని అన్నారు. 'ఐదో పేజీలో దేశంలో డీజిల్ ధర లీటరు రూ.40కు, పెట్రోల్ లీటరు రూ.50కు ఎలా ఉందో వివరాలు ఉన్నాయి. బిజెపి నాయకులు నిరసన తెలిపే గ్యాస్ సిలిండర్‌ను రూ.250కు ఎలా అమ్ముతున్నారో ఆరో పేజీలో ఉంది' అని ఆయన అన్నారు. 'దేశీయ రూపాయిని బలోపేతం చేయడానికి మోడీ రోజుకు 18 గంటలు ఎలా కష్టపడ్డారో ఎనిమిదో పేజీలో వివరాలు ఉన్నాయి' అని ఆయన మరో ఖాళీ పేజీని చూపిస్తూ అన్నారు.

క్యూబాపై దిగ్బంధనం ఎత్తేయాల్సిందే!

- బిల్లు ప్రవేశపెట్టిన అమెరికన్ సెనేటర్

వాషింగ్టన్: క్యూబాపై దశాబ్దాలుగా కొనసాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని కోరుతూ అమెరికన్ సెనేట్ ఫైనాన్స్ కమిటీ ర్యాంకింగ్ సభ్యుడు, ఆరెగాన్ డెమొక్రాట్ రాన్ వైడెన్ గత వారంలో ఒక బిల్లును ప్రవేశపెట్టారు. "క్యూబాను ఒంటరిపాటు చేసేందుకు అమెరికా చేసిన యత్నాలు బెడిసికొట్టాయని, పనికిమాలిన వ్యూహంతో క్యూబా ప్రజలను శిక్షిస్తున్నది. అమెరికన్ రైతులు, గడ్డిబీడులను నిర్వహించే పశువుల పెంపకం దారులు, క్యూబా చిన్న వ్యాపారాలకు ప్రయోజనం చేకూర్చే పెట్టుబడులకు అమెరికా తలుపులు మూసేయడం వల్ల అమెరికా పలుకుబడి కూడా పడిపోయిందని ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్, శాసనకర్త అయిన రాన్ వైడెన్ పేర్కొన్నారు. ఈ బిల్లును తోటి ఒరెగాన్ సెనేటర్ జెఫ్ మెర్క్లీ గట్టిగా బలపరిచారు. ఈ చొరవ, రిపబ్లికన్ల ప్రాబల్యం గల ఎగువ ఛాంబర్‌లో ముందుకు సాగడానికి చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. పొరుగు దేశంతో సంబంధాల సాధారణీకరణ , క్యూబా పట్ల అమెరికా విధానంలో మార్పు కోసం కాంగ్రెస్ సభ్యులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2021 ఫిబ్రవరిలో కూడా వైడెన్ ఇదే విధమైన బిల్లును ప్రవేశపెట్టారు. "1960ల నుండి కొనసాగిస్తున్న ఈ మెకానిజం విఫలమవుతుంది" అని చెప్పారు. వీలైనంత త్వరగా ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచాల్సిన బాధ్యత అమెరికా కాంగ్రెస్‌కు ఉందని ఆయన వాదించారు.

డోనాల్డ్ ట్రంప్ మొదటి టర్మ్ (2017–2021)లో క్యూబా పట్ల క్రూరంగా వ్యవహరించారు. ఇప్పుడు రెండో టర్మ్‌లో ఎలా వ్యవహరిస్తాడో చూడాల్సి ఉంది. 2017లో వైడెన్ ఇటువంటి బిల్లునే ప్రవేశపెట్టాడు. అయితే, అప్పుడది అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం పొందడంలో విఫలమైంది.



మీ కోసం

కడుపుబ్బర సమస్య ఉన్నవారు, కూరల్లో స్పూన్ జీలకర్ర పొడిని వేసుకుంటే మేలు.

జీవన సౌరభం

తక్కువ మాట్లాడటం, ఎక్కువ వినటం, పఠనా శక్తి పెంచుకోవడం విద్యార్థుల ముఖ్య లక్షణం.

పుస్తకాల జాతర




హాయ్ ఫ్రెండ్స్,

నేను, ఇటీవల విజయవాడ పుస్తక మహోత్సవానికి వెళ్లాను. అక్కడ చాలా రకరకాల పుస్తకాలు ఉన్నాయి. అన్ని రకాల పుస్తకాలు ఒకే దగ్గర చూడడం ఇదే నాకు మొదటిసారి. తెలుగు, ఇంగ్లీష్ మనకు ఏ భాష కావాలంటే ఆ భాషా పుస్తకాలు అక్కడ దొరుకుతున్నాయి. నేనైతే వాటిని చూడడానికి స్కూల్ నుండి వెళ్లిన సమయం సరిపోక ఆ రోజు సాయంత్రం మా కుటుంబంతో మళ్లీ వెళ్లాను. సాయంత్రం పూట చల్లటి వాతావరణంలో అక్కడ కొన్ని రకాల కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. పుస్తకమహోత్సవం అంటే పుస్తకాలు మాత్రమే ఉంటాయి అనుకున్నాను. కానీ అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమాలు భలే బాగున్నాయి. వాటిల్లో నాకు బాగా నచ్చింది టెలిస్కోప్. దాన్నుంచి చూస్తే భలే విచిత్రంగా కనిపిస్తుంది. నిజంగా ఈ పుస్తకం మహోత్సవం చాలా చాలా బాగుంది. నాకైతే ఒక జాతరలా నాకు అనిపించింది.



– సి.సుభాష్,
6వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.



నీడలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని జీవుల బొమ్మలు ఉన్నాయి. ఎదురుగా వాటి నీడలు ఉన్నాయి. దేని నీడ ఏదో కనిపెట్టి జతచేయండి.

నేను గీసిన బొమ్మ



దండు కావ్యశ్రీ,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
నిజాంపేట, మెదక్.



మౌనం వీడింది.. విస్తుపోయే నిజాలు చెప్పింది..



సమాజం పిల్లలకి ఎన్నో నేర్పిస్తుంది. అయితే తాము చూస్తున్న, వింటున్న సంఘటనల్లో మంచి, చెడులను బేరీజు వేసుకునేంత అవగాహన వారికి ఉండదు. అలా చెప్పేవారు లేక, చూసే వారు చెప్పక ఓ యువతి ఎదుర్కొన్న వేధింపులు, ఇప్పుడు కేరళ రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నాయి. యువతి ఇచ్చిన ఫిర్యాదులతో ఒకేసారి వివిధ పోలీసు స్టేషన్లల్లో 58 మంది పురుషులపై కంప్లైంట్లు ఫైల్ అయ్యాయి. కేరళ పోలీసులు ఇప్పటి వరకు 40 మందిని అరెస్టు చేశారు. ఇటీవల వెలుగు చూసిన ఈ దారుణం సమాజంలో పిల్లల రక్షణ, అవగాహనపై చర్చకు దారితీస్తోంది.

కేరళ.. పథనమిట్ట కొండశివారు ప్రాంతంలో యువతి నివసిస్తోంది. తను ఫిర్యాదులో పేర్కొన్న వారంతా తన చుట్టూ నివసించే వారే. వారంతా తనని లైంగికంగా వేధించారు. ప్రస్తుతం 18 ఏళ్ల తనపై 13 ఏళ్ల మైనర్‌గా ఉన్నప్పటి నుండీ ఈ పురుషులు వివిధ సందర్భాల్లో ఎంతో బాధించారని ఫిర్యాదులో ఆమె పేర్కొంది.

ఇలా వెలుగులోకి వచ్చింది..

మహిళా సాధికారత కోసం కేరళ ప్రభుత్వం ఎప్పటినుండో 'కుటుంబశ్రీ' అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. అందులో భాగంగా డిసెంబరులో యువతి చదువుతున్న కాలేజీలో 'స్నేహిత' కార్యక్రమం నిర్వహించారు. ఇదొక అవగాహనా ప్రచార కార్యక్రమం. ఇక్కడే బాధిత యువతి తనపై జరిగిన దాడిని చెప్పింది. ఈ షాకింగ్ విషయం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. వారి చొరవతో, నిందితులపై కేసులు ఫైల్ అయ్యాయి. ఇప్పటివరకు 40 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

శాపనార్థాలు, అవమానాలు

జనవరి 10 శుక్రవారం సాయంత్రం యువతి నివాసం చుట్టుపక్క ఇళ్లల్లోని పురుషులని ఒక్కొక్కరిగా పోలీసులు బయటికి తీసుకువచ్చారు. ఆ ఇళ్లకు ఎటువంటి రక్షణ గోడలు లేవు. యువతి ఇంటికి ఆనుకునే అవి ఉన్నాయి. పోలీసులు తమని ఎందుకు అరెస్టు చేస్తున్నారో, తమ వాళ్లని ఎందుకు తీసుకుపోతున్నారో అర్థంకాక ఆ ఇళ్లల్లోని వారంతా అలా నిల్చుండిపోయారు. విషయం తెలిసిన వారికి ఒక్కసారిగా బాధిత యువతిపై ఆగ్రహం కట్టలుతెంచుకుంది. 'మా కళ్ల ముందే అది పుట్టింది, పెరిగింది. ఇప్పుడు అరెస్టు చేసిన నా కొడుకు దాన్ని ఎత్తుకుని పెంచాడు' అని లబోదిబో మంటున్న ఓ మధ్యవయస్కురాలు అక్కడ ఉంది. అరెస్టు చేసిన ఆమె కొడుకు వినీత్‌కి పెళ్లయి, పిల్లలున్నారు. ఆ పక్కనే కొత్తగా పెళ్లయిన ఓ నవ వరుడిని కూడా ఈ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. పురుషులందరినీ పోలీసులు తీసుకెళ్తుంటే వారికి కొంత దూరంగా గట్టిగట్టి ఏడుపులతో, శాపనార్థాలతో తల్లులు, భార్యలు, పిల్లలు నిల్చుని ఉన్నారు.

యువతి కుటుంబం

బాధిత యువతి తల్లి ఇంటి నుండి వెళ్లిపోయి చాలా ఏళ్లయ్యింది. తండ్రి, తమ్ముడుతో యువతి నివసిస్తోంది. తండ్రి మద్యానికి బానిస. 'వాడు ఎప్పుడూ పిల్ల బాగోగులు పట్టించుకోలేదు. అది ఎక్కడికెళ్లిందో వాడికి అజా ఉండదు. పెద్దలంటే భయం లేకుండా అది పెరిగింది. ఏ బట్టలు కావాలంటే అవి వేసుకు తిరిగేది. ఇంటికి రాకుండా 3,4 రోజులు ఉన్నా తండ్రికి పట్టేది కాదు. ఇప్పుడు అది ఆరోపణలు చేసిన మా పిల్లలు అమాయకులు, కావాలనే అది వారిని ఇరికించింది' అంటూ యువతి వ్యక్తిత్వాన్ని కించపరిచేవారు, తను వేసుకున్న బట్టలని బట్టి తనని అవమానించే వారి మాటలు ఇప్పటికీ ఆ కొండశివార్లలో వినపడుతూనే ఉన్నాయి.

ఈ మొత్తం ఘటనలో యువతికి తన చుట్టూ ఉన్న సమాజం గురించి అవగాహన లేదు. ఒకవేళ ఉన్నా, మంచి, చెడుల విశ్లేషణ చేసుకోలేని వయసు. అందుకే తనపై వేధింపులకు పాల్పడుతున్న పురుషులను వారించలేకపోయింది. రోజు రోజుకు వారికి లోబడిపోయింది. ఇప్పుడు అధికారుల చొరవతో తనకి ధైర్యం వచ్చింది. నిర్భయంగా బాధ్యులను పోలీసులకు పట్టించింది. మంచితనం ముసుగులో ఆ పురుషులు చేసిన వేధింపులు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకి వస్తుంటే ఆ ఇళ్లల్లోని వారు చేష్టలుడిగి చూస్తుండిపోతున్నారు.

వేధింపులతో ఆగలేదు

బాధిత యువతి చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా ఉండేది. ఇటీవల ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కేరళ యువజనోత్సవంలో కూడా పాల్గొంది. డ్రైవింగ్‌పై కూడా తనకి ఆసక్తి ఉంది. చదువు, ఆటలు, అభిరుచి కోసం తను సాగించిన ఈ ప్రయాణంలో ఎదురైన అబ్బాయిలు, పురుషులే తనని వేధింపులకు గురిచేశారు.


వేధింపులే కాక తనపై అఘాయిత్యానికి కూడా పాల్పడ్డారని యువతి ఫిర్యాదులో పేర్కొంది. బెదిరించి, భయపెట్టి తనని హింసించారని వాపోయింది. తన వ్యక్తిగత ఫొటోలు, సన్నిహితంగా ఉన్న దృశ్యాలు ఫోన్‌లో చిత్రీకరించి నిందితులు యువతిపై పదేపదే దాడికి తెగబడ్డారు.

రోజుల వ్యవధిలో చర్యలు

కాలేజికి వచ్చిన 'స్నేహిత' బృందానికి యువతి నేరుగా తన అనుభవాలను చెప్పలేదు. లెక్చరర్ ఇచ్చిన ధైర్యంతో నిందితుల పేర్లు ఒక్కొక్కటి వెల్లడించింది. ఆ బృందం చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం ఇవ్వడం, రోజుల వ్యవధిలోనే నిందితులపై చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయింది. ప్రస్తుతం బాధిత యువతి నిర్భయ హోంలో కౌన్సిలింగ్ తీసుకుంటోంది.

బాధితురాలికి జరిగిన ఈ అన్యాయం.. సమాజంలో ఎందరో ఆడపిల్లలకు ప్రతి రోజూ జరుగుతూనే ఉంది. వెలుగులోకి రానివే ఎక్కువ. వచ్చినా అరెస్టుల వరకూ వెళ్లవు. మహిళల భద్రత, సాధికారతకు పెద్ద పీట వేసే కేరళ వంటి రాష్ట్రాల్లోనే ఇది సాధ్యం. ఆడపిల్లలకు ఈ సమాజంలో గౌరవప్రదమైన స్థానమున్నప్పుడే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఉంటాయి. అసహాయంగా ఉన్న ఆడపిల్లలను మభ్యపెట్టడం, నయానా భయాన లైంగికంగా వశపర్చుకోవటం నేరమేనని, దాని పర్యవసానం అనుభవించాల్సి ఉంటుందని ఆ యువతి ఉదంతం స్పష్టం చేస్తోంది.

పట్టు చీరల ఇస్త్రీ ఇలా...



బట్టలు ఇస్త్రీ చేసుకునేటప్పుడు, ముఖ్యంగా పట్టు చీరల ఇస్త్రీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సాధారణ దుస్తుల మాదిరి వాటిని ఇస్త్రీ చేస్తే త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- చీరలు కొనేటప్పుడే వాటిని ఇస్త్రీ చేయవచ్చో లేదో తెలుసుకోవాలి.
- ఇస్త్రీ చేసేటప్పుడు చీరపై కాటన్ వస్త్రం ఉంచి చేయాలి. ఇలా చేస్తే, వేడికి కాలిపోకుండా ఉంటాయి.
- ఐరన్ బాక్స్ మోడ్స్‌ని మార్చుకోకుండా ఇస్త్రీ చేయకూడదు. అలాగే ముందుగా చీర అంచులను ఇస్త్రీ చేయాలి. ఆ తర్వాతే చీర మధ్యలో చేయాలి. ఇలా చేస్తే ముడతలు చక్కగా పోతాయి.
- ఐరన్ చేయగానే వెంటనే మడతలు పెట్టకూడదు. హ్యాంగర్‌కు వేలాడదీయాలి. వెంటనే మడత పెడితే ముడతలు వచ్చేస్తాయి.

హాలీవుడ్‌కు జూనియర్ ఎన్టీఆర్?



తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్రనటుల్లో ఒకరైన జూనియర్ ఎన్టీఆర్ త్వరలో హాలీవుడ్‌లోకి ప్రవేశించబోతున్నారు. ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు జేమ్స్‌గన్ ఈ మేరకు ప్రకటించటం దీనికి ఊతమిస్తోంది. ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా ఎన్టీఆర్‌కు గుర్తింపువచ్చింది. గతంలో రాజమౌళి తీసిన సింహాద్రి, యమదొంగ సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఆయన వార్ 2 సినిమా ద్వారా బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హృతిక్ కలిసిలో ఆయన నటిస్తున్నారు. మరోవైపు ప్రశాంత్‌నీల్‌తో కలిసి యాక్షన్ అడ్వెంచర్‌కు కూడా సిద్ధమయ్యారు. హాలీవుడ్ చిత్ర నిర్మాత, దర్శకుడు జేమ్స్ గన్ సూపర్‌మ్యాన్, సూసైడ్ స్క్వాడ్, గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ వంటి గొప్ప అంతర్జాతీయ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆర్ఆర్ ఆర్ సినిమాలో ఎన్టీఆర్ యాక్షన్ చాలా బాగుందంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ముఖ్యంగా 'బోనుల్లో నుంచి పులులతోపాటు బయటకు దూకిన ఆ నటుడు (ఎన్టీఆర్)తో నేను పనిచేయాలనుకుంటున్నాను. అతను అద్భుత నటుడు. నేను అతనితో ఏదో ఒక రోజు పనిచేయాలనుకుంటున్నాను' అని అన్నారు. ఇప్పటిదాకా టాప్ హాలీవుడ్ ఫిల్మ్‌మేకర్ ఓ తెలుగు హీరోనుద్దేశించి మాట్లాడటం ఇదే మొదటిసారి అన్నట్లుగా ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది.



'కాంతార' టీమ్‌పై అడవి బిడ్డల ఆగ్రహం

రిషబ్ షెట్టి నటిస్తున్న 'కాంతార' చిత్రానికి ప్రీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. కాంతారకు ముందు ఏం జరిగిందనే కథాశంతో ఈ సినిమా రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. కర్ణాటకలోని అటవీ ప్రాంతాల్లో ఈ సినిమాను షూట్ చేస్తున్నారు. అయితే అడవిలో షూటింగ్ చేయడం వలన అటవీ ప్రాంతం నాశనం అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మూవీ షూటింగ్‌కి గ్రామ శివార్లలోని ఖాళీ మైదానాల్లో ప్రభుత్వం అనుమతిచ్చింది. చిత్రబృందం మాత్రం అక్రమంగా అడవిలోకి వెళ్లి షూట్ చేస్తుందని గ్రామస్తులు ఆరోపించారు. అంతేగాకుండా.. షూటింగ్ కోసం పేలుడు పదార్థాలు ఉపయోగిస్తు న్నారని దీని వలన అడవిలో ఉన్న పక్షులతో పాటు మూగజీవాలు భయాందోళనకి గురవతున్నట్లు తెలిపారు. అలాగే పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో గ్రామస్తులకు చిత్రబృందానికి మధ్య వివాదం తలెత్తింది. గ్రామానికి చెందిన ఓ యువకుడిపై చిత్ర టీమ్ దాడి చేసిందని తెలుపుతూ, గ్రామస్తులంతా యెసలూరు పోలీస్ స్టేషన్‌లో కాంతార చిత్రబృందంపై కేసు నమోదు చేశారు.


'సత్య' సినిమా నిజాయితీ ఉండేలా..



టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన 'సత్య' 1998లో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. మళ్లీ 27 ఏళ్ల తర్వాత ఈ మూవీ మరోసారి థియేటర్స్‌లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. వర్మ ఎమోషనల్ అవుతూ సోషల్‌మీడియాలో ఓ నోట్ షేర్ చేశారు. 'ఒక సినిమా తీయడమంటే బిడ్డకు జన్మనివ్వడంలాంటిదే. ముక్కలు ముక్కలుగా చిత్రీకరిస్తూ ఉంటాం. కాబట్టి ఫైనల్ అవుట్‌పుట్ ఎలా వస్తుందనేది తెలియదు. షూటింగ్ అయ్యాక దాన్ని చూసినవాళ్లు ఇది హిట్టనో, ఫట్టనో అంటారు. నేను మాత్రం సృష్టించిన అందాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. ఎంతోమందికి ఇన్స్పిరేషన్‌గా నిలిచిన నా సినిమాను లక్ష్యం లేని నా ప్రయాణంలో ఓ అడుగుగా మాత్రమే భావించారు. రెండు రోజుల క్రితం వరకూ అదే అభిప్రాయంతో ఉన్నాను. నేను సత్య మూవీలోని విషాదం చూసి చలించిపోలేదు. నన్ను నేను చూసుకుని ఏడ్చాను. నన్ను నమ్మిన వారందరికీ చేసిన ద్రోహాన్ని తలుచుకుని అపరాధ భావనతో కుమిలిపోయాను. సక్సెస్, అహంకారం తలకెక్కించుకుని తాగుబోతునయ్యాను. రంగీలా, సత్య హిట్ అవడంతో నా కళ్లు నెత్తికెక్కాయి. అప్పుడే నా విజన్‌ను కోల్పోయాను. ఎలాగో ఆ తప్పులను సరిదిద్దుకోలేను. కాబట్టి దర్శకుడిగా మొదటి స్థానంలో నిలబెట్టే సినిమాలే తీస్తాను. రెండు రోజుల క్రితం నా కన్నీళ్లు తుడుచుకుంటూ నాకు నేను ఇచ్చుకున్న మాట ఇది. 'సత్య' లాంటి సినిమా తీయలేకపోయినా.. అలాంటివి మీ ముందుకు తేవాలనే ఆలోచన కూడా క్షమించరాని నేరం. దీనర్థం నేను 'సత్య' లాంటి చిత్రాలు తీస్తానని కాదు. ఇందులో చూపించిన నిజాయితీ ఇక మీదట ప్రతి మూవీలో చూపిస్తాను. విలువైన సినిమాలే అందిస్తానని మాటిస్తున్నా' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు వర్మ కొత్త వెర్షన్ చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు.

14న 'దిల్ రూబా' విడుదల

కిరణ్ అబ్బవరం, థిల్లాన్ నటీనటులుగా నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. ఈ శివమ్ సెల్యులాయిడ్స్, సారెగమ ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'అగ్గిపుల్లె..'ను మేకర్లు ఆదివారం విడుదల చేశారు. ఈ పాటకు భాస్కరభట్ల మంచి లిరిక్స్ అందించగా, అనురాగ్ కులకర్ణి అందంగా పాడారు. 'అగ్గిపుల్లె అలా గీసినట్టు, కోపంగా చూడకే కొట్టినట్టు, గాలి దుమారమే రేగినట్టు, ఆవేశమెందుకే నొక్కిపెట్టు..' అంటూ బ్యూటీఫుల్ మెలోడీతో ఈ పాట సాగుతుంది.



క్యారెక్టర్ ఆర్టిస్ట్ విజయ్ రంగరాజు మృతి

టాలీవుడ్‌కు చెందిన క్యారెక్టర్ ఆర్టిస్ట్ విజయ్‌రంగరాజు (ఉదయ రాజ్‌కుమార్–60) గుండెపోటుతో మరణించారు. వారం రోజుల క్రితం ఓ సినిమా షూటింగ్‌లో ఆయన గాయపడ్డారు. చెన్నైలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గుండెపోటుకు గురయ్యారు. 1994లో భైరవద్వీపం సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి వచ్చిన ఆయన తెలుగు, తమిళ సినిమాల్లో విలన్, సహాయక పాత్రల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన 'వియత్నాం కాలనీ' అనే మలయాళ ఆ ఇండస్ట్రీలోకి ప్రవేశించారు. ఆ చిత్రం విజయం సాధించటంతో అక్కడ వరుసగా అవకాశాలను అందుకున్నారు. ఆ సమయంలోనే తెలుగులో భైరవద్వీపంలో విలన్‌గా నటించే అవకాశం వచ్చింది.

స్టార్ క్రికెటర్లతో రంజీట్రోఫీ కళ.. కళ...

- ముంబయికి రోహిత్, జైస్వాల్
- సౌరాష్ట్రకు జడేజా, పంజాబ్‌కు గిల్
- ఢిల్లీ వికెట్ కీపర్‌గా పంత్



రంజీట్రోఫీ కోసం రోహిత్ సాధన

ముంబయి: రంజీట్రోఫీ సీజన్–2025 స్టార్ క్రికెటర్లతో కళ కళలాడనుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు జైస్వాల్, జడేజా, గిల్, రిషబ్ పంత్ సహా పలువురు స్టార్ ఆటగాళ్లు ఈ సీజన్ రంజీట్రోఫీ బరిలో దిగనున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో అందుబాటులో ఉండే ఆటగాళ్లు తప్పకుండా దేశవాళీ లీగ్‌ల్లో ఆడాలని ఇటీవల బిసిసిఐ ఆదేశించింది. అలాగే బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో, స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్ వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో బిసిసిఐ ఆటగాళ్ల ప్రదర్శనపై నిశితంగా పరీక్షించాలని చూస్తోంది. ఈ క్రమంలో రాబోయే రంజీట్రోఫీలో అందుబాటులో ఉన్న ఆటగాళ్లంతా బరిలోకి దిగాలని ఆదేశించింది. దీంతో 10ఏళ్ల తర్వాత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ రంజీ ట్రోఫీ బరిలో దిగనున్నాడు. ఈ ఏడాది జరిగే రంజీట్రోఫీలో ముంబయి తరఫున టీమిండియా ఆటగాళ్లు రోహిత్, జైస్వాల్ ఆడనున్నారు. అజింక్యా రహానె సారథ్యంలో రోహిత్ రంజీ మ్యాచ్ ఆడనున్నాడు. జనవరి 23–26 మధ్య ముంబయి, జమ్మూ–కాశ్మీర్ మధ్య రంజీట్రోఫీ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ముంబయి 17మందితో కూడిన జట్టును ప్రకటించింది. రోహిత్‌తోపాటు స్టార్ ఆటగాళ్లు జైస్వాల్, శ్రేయస్, శివమ్ దూబె, శార్దూల్ ముంబయి జట్టుకు ఎంపికయ్యారు. అలాగే ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(సౌరాష్ట్ర), శుభ్‌మన్ గిల్(పంజాబ్), రిషభ్ పంత్(ఢిల్లీ) కూడా రంజీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమవుతున్నారు. వీరితోపాటు కెఎల్ రాహుల్(కర్ణాటక), విరాట్ కోహ్లి(ఢిల్లీ) రంజీట్రోఫీ తొలిరౌండ్ పోటీలకు దూరమైనా.. ఆ తర్వాత మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే ఛాన్స్ ఉంది. రెండో లీగ్ రంజీట్రోఫీలో భాగంగా 23నుంచి జరిగే పోటీల్లో ఆంధ్ర జట్టు పాండిచేరితో, హైదరాబాద్ జట్టు హిమాచల్ ప్రదేశ్‌తో తలపడనున్నాయి.

లక్నో కెప్టెన్‌గా పంత్...

ఐపిఎల్–20225 సీజన్‌కు లక్నో సూపర్ జెయింట్స్ కీలక ప్రకటన చేసింది. ఐపిఎల్ వేలంలో అత్యధిక ధరకు కొనుగోలు చేసిన రిషభ్ పంత్‌ను కెప్టెన్ నియమిస్తున్నట్లు ఫ్రాంఛైజీ తెలిపింది. పంత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించినట్లు సోమవారం కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఫ్రాంఛైజీ యజమాని సంజీవ్ గొయెంకా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంత్ కూడా గొయెంకాతో కలిసి పాల్గొన్నాడు. గతేడాది నవంబర్‌లో జరిగిన మెగా వేలంలో పంత్‌ను లక్నో ఏకంగా రూ.27 కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. లక్నో కెప్టెన్ రేసులో నికోలస్ పూరన్ నిలిచినా.. పంత్ వైపే యజమాన్యం మొగ్గుచూపింది. 'రిషభ్ పంత్ ఐపిఎల్‌లో అత్యంత విలువైన ఆటగాడు మాత్రమే కాదు అత్యుత్తమ ఆటగాడు. ప్రస్తుతం ఐపిఎల్‌లో మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మను విజయవంతమైన కెప్టెన్లు అని చెబుతారు. నా మాటలు గుర్తుంచుకోండి. 10–12 ఏళ్ల తర్వాత పంత్ కూడా వారి సరసన చేరుతాడు' అని సంజీవ్ గొయెంకా పేర్కొన్నారు.

జట్టు: రహానె(కెప్టెన్), రోహిత్, జైస్వాల్, ఆయుష్ మాత్రే, శ్రేయస్, సిద్ధేష్ లాడ్, దూబె, హార్దిక్ టామోర్, ఆకాష్ ఆనంద్(వికెట్ కీపర్), తనుష్ కోటియన్, శామ్స్ ములానీ, హిమాన్షు సింగ్, శార్దూల్, మోహిత్ అవస్థి, సిల్వెస్టర్ డిసౌజా, రాయిస్టన్ దయాస్, కర్ష్ కొఠారి.

క్వార్టర్స్‌కు స్వియాటెక్, కీస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి 2వ సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్, 19వ సీడ్, అమెరికాకు చెందిన కీస్ ప్రవేశించారు. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీల్లో స్వియాటెక్ 6–0, 6–1తో లైస్(జర్మనీ)ను చిత్తుచేయగా.. మరో ప్రి క్వార్టర్స్‌లో కీస్ 6–3, 1–6, 6–3తో 6వ సీడ్ రైబకినా(కజకిస్తాన్)పై సంచలన విజయం సాధించింది. ఇతర పోటీల్లో 8వ సీడ్ నవ్వారో(అమెరికా) 6–4, 5–7, 7–5తో 9వ సీడ్ కసట్కినా(రష్యా)ను, 28వ సీడ్, ఉక్రెయిన్‌కు చెందిన స్విటోలినా 6–4, 6–1తో కుడెర్మటోవా(రష్యా)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరారు.

సిన్నర్, డి–మినర్ కూడా..

పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్, 8వ సీడ్, ఆస్ట్రేలియా ఆటగాడు డి–మినర్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. సిన్నర్ 6–3, 3–6, 6–3, 6–2తో 13వ సీడ్, డెన్మార్క్‌కు చెందిన రూనేను చిత్తుచేయగా.. మరో పోటీలో ఆసీస్ సంచలనం డి–మినర్ 6–0, 7–6(7–5), 6–3తో అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు మిచెల్సన్‌ను ఓడించారు. మరో పోటీలో 21వ సీడ్ అమెరికాకు చెందిన షెల్టన్ 7–6(7–3), 6–7(3–7), 7–6(7–2), 1–0తో ఆధిక్యతలో ఉండగా మోన్‌ఫిల్(ఫ్రాన్స్) మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఇక ఇటలీకే చెందిన సొనేగో 6–3, 6–2, 3–6, 6–1తో టిన్(అమెరికా)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరారు.

సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్స్...

	పురుషులు	మహిళలు
21(మంగళ)	పాల్ × జ్వెరేవ్	గాఫ్ × బడోసా
	జకోవిచ్ × అల్కరాజ్	సబెలంక × పావెంచికోవా
22(బుధ)	సిన్నర్ × డి–మినర్	కీస్ × స్విటోలినా
	షెల్టన్ × సొనేగో	నవారో × స్వియోటెక్

నైజీరియా సంచలనం

- న్యూజిలాండ్‌పై రెండు పరుగుల తేడాతో గెలుపు
- ఐసిసి అండర్–19 మహిళల ప్రపంచకప్



కౌలాలంపూర్: ఐసిసి అండర్–19 మహిళల ప్రపంచ కప్‌లో పసికూన నైజీరియా జట్టు సంచలనం సృష్టించింది. సోమవారం జరిగిన గ్రూప్–సి లీగ్ మ్యాచ్‌లో నైజీరియా జట్టు రెండు పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై అద్భుత విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నైజీరియా జట్టు 13ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 65పరుగులే చేసింది. అనంతరం న్యూజిలాండ్‌ను నిర్ణీత ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టానికి 63పరుగులకే పరిమితం చేసింది. 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్ల నష్టానికి 57పరుగులు చేసి గెలుపుకు చేరువైన కివీస్‌ను నైజీరియా బౌలర్ చివరి ఓవర్లో కట్టడి చేసింది. నైజీరియా బ్యాటర్లలో ఉదేహ్(19), కెప్టెన్ లక్కీ(18) రెండంక్కెల స్కోర్ చేయగా.. న్యూజిలాండ్ జట్టులో అనికా టోడ్(19) బ్యాటింగ్‌లో రాణించింది. ఇక దక్షిణాఫ్రికా మహిళలజట్టు ఏకంగా 10వికెట్ల తేడాతో సమోవా మహిళలపై విజయం సాధించింది. సమోవా జట్టు 9.1ఓవర్లలో 16పరుగులకే ఆలౌట్ కాగా.. దక్షిణాఫ్రికా జట్టు 1.4ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68